

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.139	220	250
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 17.4

- పైసలివ్వనిదే పనులు జరగవు
- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని తీరు
- తాజాగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డిండి ఆర్ఐ
- 'కల్యాణలక్ష్మి' చెక్కు ఇచ్చేందుకు రూ.5వేలు డిమాండ్



అయినా.. తీరు మారలే

ఉన్నతాధికారుల విస్తృత తనిఖీలు.. పర్యటనలు ఓ వైపు.. సస్పెన్షన్లు.. కఠిన చర్యలు.. ఏసీబీ పట్టివేతలు మరోవైపు కొనసాగుతున్నా కొందరు రెవెన్యూ అధికారుల తీరు మాత్రం మారడం లేదు. పోస్టింగ్ వచ్చిందే తడువు కొందరు పైసా కమాయించడంపైనే దృష్టిసారిస్తున్నారన్న ఆరోపణలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారిని నెలల తరబడి తిప్పించుకుంటున్నారని, పైసలిస్తే మాత్రం వెంటనే చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాజాగా ఓ లబ్ధిదారుడికి కల్యాణలక్ష్మి చెక్కు ఇచ్చేందుకు రూ.5 వేలు లంచం తీసుకుంటూ నల్లగొండ జిల్లా డిండి తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు.

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలకు ఇన్‌చార్జి తహసీల్దార్లు ఉన్నారు. ప్రస్తుతం సొంత మండలంలోనే పలు సర్వేలు, ప్రభుత్వ పథకాల బాధ్యతలు ఉండటంతో వారు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మండలాలపై అంతగా దృష్టిసారించలేకపోతున్నారు. దీంతో సదరు మండలాల్లో కింది స్థాయి ఉద్యోగుల ఇష్టారాజ్యమైందనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో సర్వేయర్ల కొరత కూడా ఉంది. ఏదైనా భూ సర్వే కోసం అర్జీ పెడితే నెలలకొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని, పైసలిస్తేనే సర్వేయర్లు భూ కొలతలకు వస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఓ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో పైరవీకారులదే పెత్తనం నడుస్తోంది. సస్పెండ్ అయిన రెవెన్యూ ఉద్యోగులకు మూడు నెలలు తిరగకముందే పోస్టింగులు ఇస్తుండటంతో వారి ఇష్టారాజ్యమైంది. డిండి మండలంలో ధరణి పోర్టల్‌లో మిస్సింగ్ సర్వే నంబర్లు రెవెన్యూ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కొన్ని కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించకపోవడంతో గంటలకొద్దీ వేచి ఉండటంతో పాటు పనుల కోసం కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సివస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రూ.5వేలు ఇస్తేనే..

నల్లగొండ జిల్లా డిండి మండలం పడమటితండాకు చెందిన రాత్లావత్ పాండు హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన తన కుమార్తె అఖిలను 10 డిసెంబరు 2021న మహబూబ్‌నగర్ జిల్లా జైనుల్లాపూర్ కొత్రతండాకు చెందిన తిరుపతికి ఇచ్చి వివాహం చేశాడు. కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేయగా, మూడేళ్లుగా చెక్కు జారీ కాలేదు. చెక్కు జారీ చేసేందుకు ఆర్ఐ శ్యాంనాయక్ రూ.10వేలు లంచం డిమాండ్ చేయటంతో పాండు రూ.5వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఈ క్రమంలో పాండునాయక్ తన బావమరిది శంకర్‌తో కలిసి ఈ నెల 9వ తేదీన నల్లగొండ ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించాడు. ఆర్ఐ శ్యాంనాయక్ కూడా హైదరాబాద్‌లోని హస్తినాపురంలోని ఊర్మిలనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శుక్రవారం పాండునాయక్ హస్తినాపురంలోని ఆర్ఐ శ్యాంనాయక్ ఇంటికి వెళ్లి రూ.5వేలు లంచం ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు శ్యాంనాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్యాంనాయక్ గతంలో పీఏపల్లి మండలంలో పనిచేస్తున్న సమయంలోనూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ● 6లో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 199మంది పంచాయతీ కార్యదర్శులు ప్రొబేషనరీ (శిక్షణ) సమయంలోనే విధులకు డుమ్మా కొడుతున్నారు. సర్వీస్ క్రమబద్ధీకరణ జరగకముందే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండా నెలలు గా గైర్హాజరవుతున్నారు. ఇటీవల కొందరు విధుల్లో చేరేందుకు రాగా, వారికి ఆయా జిల్లాల కలెక్టర్లు షోకాజ్ నోటీసులు జారీ చేసి విధుల్లోకి తీసుకున్నారు. షోకాజ్‌లకు వారిచ్చే వివరణకు సంతృప్తి చెందితే ఎలాంటి చర్యలు ఉండవు. లేకుంటే చర్యలకు లోబడాల్సి ఉంటుంది. కాగా, నల్లగొండ జిల్లాలో 99మంది పంచాయతీ కార్యదర్శులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి కఠిన చర్యలు తీసుకున్నారు. వారి సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

-ఆంధ్రజ్యోతి, సూర్యాపేట కలెక్టరేట్, నల్లగొండ





పంచాయతీ కార్యదర్శులపై కొరడా

- అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు
- ఉమ్మడి జిల్లాలో 199 మంది కార్యదర్శులకు షోకాజ్
- నల్లగొండ జిల్లాలో 99మంది సర్వీస్ బ్రేక్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం

ప్రొబేషనరీ సమయంలో ఏ శాఖకు సంబంధించిన ఉద్యోగి అయినా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కాకూడదు. ఒకవేళ అయితే అధికారుల చర్యలకు గురికావాల్సి ఉంటుంది. ప్రతీ ఉద్యోగికి రెండేళ్ల ప్రొబేషనరీ సమయం ఉంటుంది. ఆ సమయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అంకితభావంతో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ విధుల్లో పొరపాట్లు చేస్తే వారి సర్వీస్ క్రమబద్ధీకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయి. అందుకోసం ప్రతీ ఉద్యోగి ప్రొబేషనరీ సమయంలో ఎంతో జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 199 మంది కార్య దర్శులకు షోకాజ్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 199 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు షోకాజ్ జారీ చేశారు. నల్లగొండ జిల్లాలో 99 మంది, సూర్యాపేట జిల్లాలో 70మంది, యాదాద్రి జిల్లాలో 30మంది గ్రామకార్యదర్శులు ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా నెలల తరబడి విధులకు గైర్హాజరయ్యారు. ఇటీవల వారు విధుల్లో చేరేందుకు రాగా, వారికి ఆయా జిల్లాల కలెక్టర్లు షోకాజ్ జారీ చేసి విధుల్లోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారందరూ వారికి కేటాయించిన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే షోకాజ్‌లపై విచారణకు ప్రత్యేకాధికారిని నియమించనున్నారు. ఏదైనా అత్యవసర పనుల నిమిత్తం, ఆరోగ్య కారణాల కారణంగా గైర్హాజరైతే మాత్రం వారికి చర్యల నుంచి మినహాయింపు దక్కనుంది.

గైర్హాజరుతో ఇతరులపై పనిభారం

ఉమ్మడి జిల్లాలో సుమారు 199 మంది గ్రామకార్యదర్శులు విధులకు గైర్హాజరు కావడంతో వారి విధులు మిగిలిన వారు చేయాల్సి వస్తోంది. దీంతో ఇతర...

- మిగతా 6వ పేజీలో...

కార్యదర్శులకు నష్టం ఉండదు

ముందస్తు అనుమతి లేకుండా దీర్ఘకాలం విధులకు గైర్హాజరైన వారిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తాం. అయితే పంచాయతీ కార్యదర్శుల విషయంలో మానవతా దృక్పథంతో వారిని సస్పెండ్ చేయకుండా సర్వీస్ బ్రేక్ చేసి విధుల్లోకి తీసుకున్నాం. జిల్లాలో సుమారు 99మంది పంచాయతీ కార్యదర్శులు ముందస్తు అనుమతి లేకుండా నెలలతరబడి విధులకు గైర్హాజరయ్యారు. వీరిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, రెగ్యులర్ కార్యదర్శులు ఉన్నారు. సర్వీస్ బ్రేక్ చేసి విధుల్లోకి తీసుకోవడం వల్ల వారికి నష్టమేమీ ఉండదు.

- ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్



గైర్హాజరైన కార్యదర్శులకు షోకాజ్‌లు జారీ చేశాం.

ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండా విధులకు గైర్హాజరైన పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం వారందరికీ కేటాయించిన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. నెలల తరబడి విధులకు గైర్హాజరు కావడంతో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలులో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో సమీప గ్రామాల కార్యదర్శులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాం. షోకాజ్‌లకు వివరణ ఇచ్చిన అనంతరం కలెక్టర్ చర్యలు తీసుకోనున్నారు.

- నారాయణరెడ్డి, డీపీవో, సూర్యాపేట జిల్లా

గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్, పాల్గొన్న కలెక్టర్ త్రిపాఠి

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాలుగు పథకాలకు సంబంధించిన విధివిధానాలను గ్రామసభల్లో ప్రజలకు వివరించి జాబితాను చదివి అర్హులను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, రైతు భరోసా సర్వేకు జిల్లాలో 140 బృందాలు ఏర్పాటు చేసి ఈనెల 16 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 138 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందని తెలిపారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి అనితా రాంచంద్రన్ అన్నారు. శుక్రవారం కనగల్‌లో రేషన్‌కార్డుల సర్వేను ఆమె తనిఖీచేసి అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆమె వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, ఎంపీవో సుమలత, డీటీ పార్వతమ్మ, తదితరులు ఉన్నారు.



మదర్ డెయిరీపై రాజకీయ రగడ

మదర్ డెయిరీపై రాజకీయ రగడ జోరందుకుంది. స్వచ్ఛందంగా పాల ఉత్పత్తిదారులతో కొనసాగాల్సిన సంఘాలకు రాజకీయ రంగు పులుముకుంది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలు నగరానికి చేరువలో ఉండటంతో పాడి రైతులు నిత్యం హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాలకు ఇక్కడి నుంచి పాలను సరఫరా చేస్తున్నారు. ఒకప్పుడు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరపతి సహకార సంఘానికి(నార్ముల్) పాడి రైతులతో కూడిన పాలకవర్గం ఉండేది. నేడు అది రాజకీయాలకు వేదికగా మారింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

మదర్ డెయిరీ పాలకమండలి రూపొందించిన నష్టాల నివేదిక ఇలా..

సంవత్సరం	నష్టం
2015-16	రూ.8,12,58,578
2016-17	రూ.2,11,47,520
2017-18	రూ.2,24,83,176
2018-19	రూ.1,98,33,139
2019-20	రూ.3,08,79,584
2020-21	రూ.1,92,33,229
2021-22	రూ.3,67,02,301
2022-23	రూ.4,52,17,923
2023-24	రూ.7,48,33,021
మొత్తం	రూ.35,15,88,471

- ఆర్థికాభివృద్ధిపై కాంగ్రెస్,బీఆర్ఎస్ నేతల సవాళ్లు
- సంస్థ లాభ,నష్టాలపై ప్రచ్ఛన్న యుద్ధం
- ఫిబ్రవరి 7న సర్వసభ్య సమావేశం
- సంస్థ భూముల విక్రయమే ప్రధాన అజెండా

మదర్ డెయిరీలోని ఆస్తులు, లాభాలు, నష్టాలపై అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రస్తుత ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది. రైతుల డబ్బులతో కొనుగోలు చేసిన మదర్ డెయిరీ భూములను విక్రయించాలని ప్రస్తుత పాలకవర్గం చూస్తోందని గత పాలకవర్గ సభ్యులు ఆరోపిస్తున్నారు. రైతులకు బోనస్ చెల్లించడంతోపాటు సంస్థ ఆస్తులను కాపాడామని డిమాండ్ చేస్తున్నారు. అయితే పదేళ్లుగా మదర్ డెయిరీలో జరిగిన అవకతవకల కారణంగా నష్టాలు వచ్చాయని, దీంతో సంస్థ భూములు విక్రయించి రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ప్రస్తుతం పాలకవర్గం ఎదురుదాడి చేస్తోంది. కొత్త పాలకవర్గం మూడునెలల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్‌కు చెందిన సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, నష్టాలు సహా పాల సంఘాలకు వివరించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఫిబ్రవరి 7వ తేదీన పాల సంఘాలతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, భూముల విక్రయంపై తీర్మానం చేసేందుకు ప్రస్తుత పాలకవర్గం సన్నాహాలు చేస్తోంది. మదర్ డెయిరీకి చిట్యాలలో 32ఎకరాలు, మిర్యాలగూడలో 1.20ఎకరాలు, హాలియా, మాల్, తదితర ప్రాంతాల్లో సొంతంగా భూములు ఉన్నాయి. ఈ భూములపైనే ప్రస్తుత, గత పాలకవర్గ సభ్యుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 350 పాలకసంఘాలు ఉన్నాయి. అన్ని సంఘాల చైర్మన్లను సర్వసభ్య సమావేశానికి ఆహ్వానించి, మదర్ డెయిరీ ఆర్థిక పరిస్థితి, లాభాలు, నష్టాలపై పూర్తిస్థాయి నివేదికను అందించేందుకు ప్రస్తుత పాలకవర్గం ప్రయత్నాలు - మిగతా 7వ పేజీలో...

మాతాశిశు మరణాల సంఖ్య తగ్గాలి

- రోగులకు అందుబాటులో ఉండి సేవలందించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, కొండమల్లేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మాతాశిశు మరణాల సంఖ్య తగ్గాలని, రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని, మళ్లీ వారంలో వస్తానని, అప్పటి వరకు మార్పు రావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, డయాలసిస్, ఎన్‌సీహెచ్ విభాగం, మందుల స్టాక్ వివరాలను తనిఖీచేశారు. మాతాశిశు సంరక్షణ విభాగాన్ని సందర్శించి బాలింతలతో మాట్లాడారు. ఔట్, ఇన్ పేషంట్ల వివరాలను పరిశీలించి వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ మంగ్యానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో కొంతమంది మద్యం తాగి ఆస్పత్రికి వస్తున్నారని, ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఎస్పీతో మాట్లాడి ఔట్‌పోస్టు ఏర్పాటు కృషి చేస్తానన్నారు. కలెక్టర్‌వెంట ఆర్డీవో రమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్,తహసీల్దార్ సంతోష్‌కిరణ్, సీఐ నర్సింహులు, ఎస్ఐ రమేష్, తదితరులు ఉన్నారు. అనంతరం పట్టణంలోని తాటికోలు రోడ్డులో రేషన్‌కార్డుల సర్వేను కలెక్టర్ తనిఖీచేశారు. అదేవిధంగా కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి పంచాయతీలో సర్వేను కలెక్టర్ తనిఖీచేశారు.

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ క్రైం): నల్లగొండను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయిని నిర్మూలించేందుకు మిషన్ పరివర్తన్ కింద అవగాహన కార్యక్రమాలు మళ్లీ నిర్వహించాలని సూచించారు. గంజాయి సాగుచేస్తే రైతులకు రైతుభరోసా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ నెల 21న మరోమారు అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. నల్లగొండ ఆస్పత్రిలో డ్రగ్ డీఅడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్‌శాఖ అధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం


ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్ రెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు పలు ప్రభుత్వ విద్యా సంస్థలకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో గెలిచిన అభ్యర్థులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదన్నారు. అంతేగాక ఉపాధ్యాయులు, అధ్యాపకులకు వ్యతిరేక నిర్ణయాలు వచ్చినప్పుడు ఖండించాల్సింది పోయి పాలకుల పంచన చేరారని విమర్శించారు. 317 జీవో తెచ్చినది తానేనని చెప్పిన వ్యక్తి ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్నాడని, సీపీఎస్ రద్దు, పదోన్నతులు, సర్వీస్ రూల్స్ తెస్తానని మోసం చేసి మళ్లీ మభ్యపెట్టి ఓట్లు వేయించుకునేందుకు వస్తున్న వారి మోసాలను పసిగట్టాలన్నారు. 42 ఉపాధ్యాయ సంఘాల జేఏసీ మద్దతుతో తాను ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నాని, మ్యానిఫెస్టోను ముందుంచుతూ ఓట్లను అభ్యర్థిసున్నానన్నారు. ఉమ్మడి సర్వీస్ సాధించి పదోన్నతులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయించడంతో పాటు 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి 010 పద్దు ద్వారా వేతనాలు, ఆరోగ్య కార్డుల సౌకర్యం కల్పించేందుకు పోరాడతానన్నారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్, కేజీబీవీలో హాస్టల్ వార్డెన్లను నియమిస్తూ రెండో శనివారం సెలవు కోసం ప్రయత్నిస్తానన్నారు. ఉపాధ్యాయులకు నెలనెలా పదోన్నతులు, ఏటా వేసవిలో బదిలీలకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

నేడు చండూరు మునిసిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్



చండూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపల్ కమిషనర్ మున్వర్ అలీతో శనివారం 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొని పట్టణ ప్రజలు వారి సమస్యలు నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు. సమస్యలు ఉన్న వారు 9949920611 నెంబర్‌కు ఫోన్ చేసి కమిషనర్ మున్వర్ అలీతో నేరుగా మాట్లాడవచ్చు.

అంబుజా సిమెంట్‌పై

నేడు ప్రజాభిప్రాయ సేకరణ



దామరచర్ల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేష్‌పహాడ్ గ్రామ సమీపంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ (పెన్నా సిమెంట్) మైనింగ్ విస్తరణపై అధికారులు శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. 2002లో పెన్నా సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం నిర్మించగా, ఇటీవల ఈ పరిశ్రమను అదానీ గ్రూప్ కొనుగోలు చేసి అంబుజా సిమెంట్‌గా పేరు మార్చింది. మండలంతో పాటు సూర్యాపేట జిల్లా శూన్యపహాడ్ గ్రామ పరిధిలో మొత్తం 354 హెక్టార్లలో మైనింగ్ గనులు విస్తరించి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.8మిలియన్ టన్నులకు పెంచేందుకు పరిశ్రమ యాజమాన్యం గనులశాఖ, కాలుష్య నియంత్రణ మండలికి దరఖాస్తు చేసుకుంది. అదేవిధంగా పరిశ్రమ అనుమతులు రెండేళ్ల క్రితమే ముగిసినా యాజమాన్యం అక్రమంగా తవ్వకాలు చేస్తోందని పలువురు పర్యావరణ వేత్తలు, స్థానికులు ఇటీవల పీసీబీ, జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అటవీ భూములను సైతం ఆక్రమించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గనుల విస్తరణపై చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలు తెలిపేందుకు స్థానికులు సన్నద్ధమయ్యారు. ఇటీవల కాలంలో రెండు పర్యాయాలు ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు నిర్ణయించినా, పలు కారణాలతో అవి వాయిదా పడ్డాయి. తాజాగా, మూడోసారి ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్రంలో 927 శాఖలతో రూ.70కోట్ల వ్యాపారంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తోందని బ్యాంక్ చైర్మన్ వై.శోభ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని ప్రాంతీయ కార్యాలయం, స్థానిక బ్రాంచ్‌లను ఆమె పరిశీలించి మాట్లాడారు. బ్యాంక్ ద్వారా రైతులు, స్వయం సహాయక బృందాలు, వ్యాపారులకు సేవలందిస్తున్నామన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతంలో బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో సైతం తాము సేవలందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎంబీ దేవేందర్, ఎస్ఎంవో సీహెచ్.వెంకటేశ్, డీపీఎం రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయినా..తీరు మారలే

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి పర్వం మరోసారి చర్చనీయాంశమైంది. అన్నిస్థాయిల్లోని సిబ్బంది అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. డబ్బులు ఇవ్వందే ఏ పనీ చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేకుంటే కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిప్పించుకుంటున్నారు. దీంతో విసిగి వేసారిన ప్రజలు ఎంతో కొంత ఇచ్చుకుని పనులు చేయించుకుంటున్నారు. బాధితులు అవినీతి అధికారులను అడపాదడపా ఏసీబీ అధికారులకు పట్టిస్తున్నా మిగతా వారిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు.



- ● ఏసీబీకి పట్టిస్తున్నా మారని తీరు
- ● రిజిస్ట్రేషన్లకు ఎదురుచూపులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పీఏపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మామూళ్లు ఇవ్వందే ఏపనీ జరగదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి, వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అవినీతిపై ఆధారాలు చూపించినా చర్యలు తీసుకోవడం లేదని, దీంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో తహసీల్థార్, ఆర్ఐలు అన్నీ తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. స్థానిక అధికారులపై ఉన్నతాధికారులకు ఎన్నో ఫిర్యాదులు వెళ్లినా చర్యలు లేకపోవడంతో వారిలో మార్పురావడంలేదని ప్రజలు అంటున్నారు.గతంలో ఓ అధికారిని ఏసీబీ పట్టి ంచినా మిగతావారిలో మార్పులేదంటున్నారు.

● ఎర్రకుంటతండాకు చెందిన క్రొర లక్‌పతికి చెందిన భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై బాధితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అయినా అధికారులపై చర్యలు తీసుకోలేదు.

● 2021లో పీఏపల్లి ఆర్ఐగా పనిచేసిన శ్యాంనాయక్ భీమనపల్లి రైతు భూమి సరిచేసేందుకు అతని వద్ద రూ.10 వేలు డిమాండ్ చేశాడు. దీంతో ఆ రైతు ఏసీబీ అధికారులను సంప్రదించగా రైతు వద్ద నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు కార్యాలయంలోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిబ్బంది పనితీరుపై వివరణ కోరేందుకు తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా సమాధానం ఇవ్వలేదు.

చర్యలు శూన్యం

పెద్దఅడిశర్లపల్లి మండలం ఎర్రగుంట తండా రమావత్ పాండుకు చెందిన 187, 12 సర్వేనెంబర్లలో 2.34ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం ఆ భూమిలో సేద్యం చేస్తున్నాడు. కానీ ధరణి పోర్టల్‌లో ఆ భూమిని తొలగించారు. దీంతో మీ సేవా ద్వారా అన్ని ఆధారాలు చూపిస్తూ రైతు దరఖాస్తు చేసుకున్నాడు. ఆ రశీదుతో ఆర్ఐ శీలం క్రాంతిని కలవగా రికార్డులు సరిచేయాలంటే రూ.లక్ష అవుతుందని, ఇవ్వకుంటే ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూతిరిగినా పనికాదని చెప్పాడు. ఆ డబ్బులు పైఅధికారులకు ముట్టజెప్పితేనే పనిఅవుతుందని చెప్పడంతో ఆ రైతు రూ.50వేలకు ఒప్పందం చేసుకున్నాడు. ఫోన్‌పే ద్వారా రూ.15,000, రూ.13000, రూ.22000 నగదురూపంలో ఆర్ఐ క్రాంతికి ముట్టజెప్పాడు. అయినా పనిచేయకుండా తిప్పించుకోవడంతో గత డిసెంబరు 19న ఆర్డీవో రమణారెడ్డి ఎదుట ఆర్ఐ క్రాంతిని రైతు నిలదీశాడు. తాము ఇచ్చిన డబ్బులకు ఆధారాలు ఆర్డీవోకు చూపించారు. క్రాంతిపై నివేదికను పైఅధికారులకు పెట్టామంటూ అధికారులు చేతులు దులుపుకున్నారు. అతడిపై ఇంతవరకు చర్యలు తీసుకోపోగా యధావిధిగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

సంస్థాన్‌నారాయణపురం : యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం రెవెన్యూ అధికారులు, సిబ్బంది చిన్నపనికి కూడా ప్రజలను రోజుల తరబడి తిప్పించుకుంటున్నారు. ప్రతీపనికి అధికారుల నుంచి సిబ్బంది వరకూ చేయి తడపాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపణలు ఉన్నాయి. అన్నిరికార్డులు సక్రమంగా ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో సిబ్బందికి ఎంతోకొంత డబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్లు ప్రక్రియను చేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.ఓ గ్రామంలో అన్నదమ్ములకు సమానంగా రావాల్సిన భూమి నమోదులో ఎక్కువ తక్కువగా నమోదయ్యాయి. దీనిని సరిచేయడానికి కార్యాలయం చుట్టూ రోజుల తరబడి రప్పించుకున్నారు. సామాన్యులను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది సహకారంతోనే..

మోతె : సూర్యాపేట జిల్లా మోతె తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అక్రమార్కులకు ఊతమిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ధరణిలో భూసమస్యల పరిష్కారానికి నామవరం, మామిళ్లగూడెం, సిరికొండ, మోతె, సర్వారం గ్రామాలకు చెందిన వారు పైరవీకారులుగా ఉంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ధరణిలో భూముల వివరాలు నమోదు చేసే సమయంలో ఒక్కో గ్రామంలో 200 నుంచి 350 ఎకరాల పైబడి అదనంగా బై నెంబర్లతో ఆన్‌లైన్ చేశారు. ఇప్పుడు ఆ సమస్య పరిష్కారానికి పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సిరికొండ గ్రామానికి చెందిన వీఆర్‌వో రైతు వద్ద డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. మోతె మండలంలో జిల్లాలో ఎక్కడా లేనన్ని భూసమస్యలు ఉండటంతో 2018లో అప్పటి కలెక్టర్ ప్రజావేదిక నిర్వహించి మూడు రోజులు పాటు నేరుగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సంఘమిత్రను వివరణ కోరగా కార్యాలయంలో ఎటువంటి అవినీతి జరగడం లేదని తహసీల్దార్ సంఘమిత తెలిపారు.



సస్పెండ్ అయ్యాక మూడు నెలల్లోనే పోస్టింగ్

కోదాడ రెవెన్యూ కార్యాలయ ఆర్ఐ సుజీత్ పట్టా మార్పిడి విషయంలో రైతు నుంచి డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో అధికారి మాటలను రైతు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడంతో ఆర్ఐని సస్పెండ్ చేశారు. మూడు నెలలు కాకముందే మోతె మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాడు.

విచారణ చేపట్టాలి

ఒక్కో గ్రామంలో 100ఎకరాల పైబడి భూములను బై నెంబర్లను వేసి ఆన్‌లైన్ చేశారు. ఇప్పుడు ఆయా భూములకు రూ.లక్షల్లో రైతుబంధు పొందుతున్నారు. భూమి పట్టాలు లేని వారికి పట్టా చేస్తే వారి వద్ద నుంచి పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారు. నామవరంలో గతంలో పనిచేసిన వీఆర్ఏల అండతో డబ్బులు తీసుకుని 200 ఎకరాల పైబడి అదనంగా పట్టాలు చేశారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలి.



బైరి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

అవీ ఇవీ

పాత రికార్డులతో ఆదాయం జోరు

బొమ్మలరామారం: యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులకు డిమాండ్ నెలకొంది. ఔటర్ రింగురోడ్డుకు రానున్న రోజుల్లో నూతనంగా ఏర్పాటయ్యే ఆర్ఆర్ఆర్ రోడ్డుకు మధ్యలో బొమ్మలరామారం ఉండడంతో ఈ ప్రాంతంలో భూములకు డిమాండ్ ఉంది. జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉండడంతో తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులతో పని ఏర్పడుతుంది. దీంతో కిందిస్థాయి నుంచి మండల స్థాయి అధికారులకు వరకు ప్రతీ రోజూ రికార్డుల పేరిట డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమకు కావాల్సిన భూరికార్డులను భారీమొత్తంలో డబ్బులు చెల్లించి తీసుకుంటున్నారు. ఇది కాస్త సామాన్య రైతులు, ప్రజలకు ఇబ్బందిగా మారింది. తహసీల్దార్ కార్యాలయంలో ఏ సేవ అయినా పొందాలంటూ డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో దొరకని భూరికార్డుల కోసం రూ.6వేల నుంచి రూ.20వేల వరకు ముడుపులు చెల్లించక తప్పడం లేదని సామాన్య ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

కాసులు కురిపిస్తున్న మిస్సింగ్ సర్వే నెంబర్లు

డిండి : పాస్‌పుస్తకంలో ఉన్న భూమి వివరాలు ధరణి ఆన్‌లైన్‌లో చేర్చకపోవడం రెవెన్యూ అధికారులకు కాసుల పంట కురిపిస్తోంది. నల్లగొండ జిల్లా డిండి మండలంలో సుమారు 1200సర్వే నెంబర్లకు పైగా ధరణిలోకి ఎక్కలేదు. మండలంలో 38 పంచాయతీల్లో ఉన్నాయి. చాలాచోట్ల ఈ సమస్య నెలకొంది. దీంతో పాస్‌పుస్తకంలోకి నమోదు కోసం రైతులు కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. తమ సమస్య పరిష్కారానికి అధికారుల చేతులు తడుపుతున్నారు. నిత్యం కార్యాలయం చుట్టు తిరుగలేక రైతులు గ్రామాలలో ఉండే మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. డబ్బులిస్తేనే సర్వే నెంబర్ ధరణిలో నమోదవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **అన్ని పనులకు ఎదురుచూపులే....**

నార్కట్‌పల్లి:నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు సేవలందడంలో రోజులు గడుస్తున్నాయి.ఏపనికోసమైనా అర్జీదారులు ఎదురుచూడాల్సి వస్తుందన్న విమర్శలు వినవస్తున్నాయి. ప్రధానంగా భూముల సర్వేకు బాధితులు తీవ్రఇబ్బందిపడుతున్నారు. పెద్దసంఖ్యలో మీ సేవ ద్వారా భూసర్వే కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే మండల సర్వేయర్‌కు నల్లగొండ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఉండటం, ఇతర ప్రాజెక్టు భూసేకరణకు సమయం ఇవ్వాల్సి వస్తోంది. దీంతో రెండు నెలలుగా మండలంలో భూముల సర్వే నిలిచింది. సర్వే ఆలస్యంతో కొన్నిసార్లు ఘర్షణలు తలెత్తిన ఘటనలు ఉన్నాయి.

పౌతీ చేయడం లేదు



మాది అవుర వాణి గ్రామం. మా తండ్రి నర్సింహకి ప్రభుత్వం 1.20 ఎకరం అసైన్డ్‌చేసింది. ఆరేళ్ల కిందట ఆయన చనిపోయారు. మేము ముగ్గురు అన్నదమ్ములం. ఆ భూమిని మాపేరిట పౌతీ చేసేందుకు తల్లి సైదమ్మ అంగీకరించింది. కానీ అధికారులు ఐదేళ్లుగా పౌతీ చేయడం లేదు.

మాదగోని వెంకన్న

చనిపోయిన వ్యక్తి పేరిట భూమి లేదు

అవురవాణిలోని 228సర్వేనెంబర్ పహణి ప్రకారం చనిపోయిన మాదగోని నర్సింహ పేరిట భూమి రికార్డుల్లో లేదు. దరఖాస్తు పరిశీలించి న్యాయం చేస్తాం.

తరుణ్, ఆర్ఐ, నార్కట్‌పల్లి

కొండమల్లేపల్లి:మండలాల పునర్విభజనలో భాగంగా 2016లో కొండమల్లేపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకూ అధికారులు సమయపాలన పాటించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి రాత్రి ఎనిమిది గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.మూడేళ్లుగా ప్రింటర్ పనిచేయడంలేదు.పాస్‌పుస్తకంలో నమోదుకు సమీప మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ పనికైనా డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సమయపాలనేదీ?

నాంపల్లి:నల్లగొండ జిల్లా నాంపల్లి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని రైతులు వాపోతున్నారు. ధరణిలో స్లాట్‌బుక్ చేసుకున్నా అధికారుల కోసం వేచిచూడాల్సివస్తోంది. ఉదయం స్లాట్‌బుక్ చేసుకుంటే ఏ సాయంత్రమో రిజిస్ట్రేషన్ చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. కార్యాలయంలో కనీస సౌకర్యాలు కూడా లేవు. ఇదిలా ఉండగా తహసీల్దార్ దేవసింగ్ మాట్లాడుతూ సిబ్బంది కొరతతో రిజిస్ట్రేషన్లు ఆలస్యం అవుతున్నాయన్నారు.

ఇన్‌చార్జీ పాలనతో ఇక్కట్లు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఇన్‌చార్జి తహసీల్దార్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తుర్కపల్లి తహసీల్దార్ దేశ్యనాయక్ ఇన్‌చార్జీగా కొనసాగిస్తున్నారు. దీంతో గుట్టకు పూర్తి సమయం కేటాయించకపోవడంతో పరిపాలన కుంటుపడుతోంది. రెండు మండలాల బాధ్యతలు చూడటం కూడా ఆయనకు తలనొప్పిగా మారింది. అదేవిధంగా రైతు భరోసా, రేషన్‌కార్డుల విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక కష్టతరంగా మారింది.



పూర్తిస్థాయి తహసీల్దార్‌ను నియమించాలి



యాదగిరిగుట్ట పర్యాటకకేంద్రం అయినందున పూర్తిస్థాయి తహసీల్దార్‌ను వెంటనే ఏర్పాటుచేయాలి. ఇన్‌చార్జీ తహసీల్దార్‌తో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కల్లెపల్లి మహేందర్, యాదగిరిగుట్ట

పంచాయతీ కార్యదర్శిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి



భువనగిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యదర్శి రాజశేఖర్

మోటకొండూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విధులకు హాజరయ్యేందుకు వెళుతున్న పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామ శివారులో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ పాండు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం షారాజిపేట గ్రామానికి చెందిన రాజశేఖర్ మోటకొండూరు మండలం చాడ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం తన స్వగ్రామం నుంచి చాడ గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరి చాడ ఆవాస గ్రామం పిట్టలగూడెం క్రాస్ రోడ్డు వద్దకు చేరుకున్నాడు. అప్పటికే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని పంచాయతీ కార్యదర్శి వాహనానికి అడ్డు పెట్టారు. తమ వాహనంలో పెట్రోలు అయిపోయిందని, పెట్రోలు కావాలని ఆడిగారు. పెట్రోలు తన దగ్గర ఎందుకు ఉంటదని కార్యదర్శి బదులిచ్చారు. అదే సమయంలో చందేపల్లి నుంచి మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అక్కడికి రాగా, మొత్తం ఐదుగురు కలిసి రాజశేఖర్‌ను విచక్షణా రహితంగా కొట్టారు. హెల్మెట్‌తో తలపై బలంగా కొట్టడంతో తలకు తీవ్ర గాయమై రోడ్డుపై పడిపోయాడు. 'మీరు ఎవరు నన్ను ఎందుకు కొడుతున్నారు? అని అడిగినా చెప్పకుండానే కొడుతుండగా తన సెల్‌ఫోన్‌లో మాట్లడేందుకు ప్రయత్నించగా ఫోన్‌ను లాక్కొని పగలగొట్టారు. వెంటనే దుడగులు చందేపల్లి వైపు వెళ్లిపోయారు. అదే సమయంతో అటు వైపుగా వెళుతున్న యశ్వంత్ పంచాయతీ కార్యదర్శిని గమనించి మాజీ సర్పంచ్ మల్గా ఎట్టమ్మ కుమారుడు సిద్దులుకు సమచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న సిద్దులు అంబులెన్స్‌లో భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలాన్ని అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ కొండల్‌రావు, ఎస్ఐ పాండు చేరుకుని అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

కోదాడలో గ్యాస్ సిలిండర్ దొంగ అరెస్ట్

కోదాడ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దొంగిలించిన బైక్‌లపై సిలిండర్లను చోరీ చేస్తున్న దొంగను సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు గురువారం పట్టుకున్నారు. కోదాడ టౌన్ సీఐ రాము శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కోదాడటౌన్ ఎస్ఐ రంజిత్‌రెడ్డి తన సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో ఒక యూనికాన్ వాహనంపై కోదాడ పట్టణానికి చెందిన మామిడి శ్రీకాంత్ గ్యాస్ సిలిండర్లను వేసుకొని వెళ్తున్నాడు. పోలీసులను చూసి దారి మళ్లించడంతో పోలీసులు వెంబడించి అతడిని పట్టుకుని విచారించారు. విచారణలో ఇప్పటి వరకు 39 సిలిండర్లను చోరీ చేసినట్లు వెల్లడించారు. అతడిచ్చిన సమాచారం 23 మంది నుంచి గ్యాస్ సిలిండర్లను రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. అతడిపై గతంలోనే 7 కేసులు నమోదయ్యాయని, అతడిని రిమాండ్‌కు తరలించామన్నారు. దొంగ అరెస్టులో చాకచక్యంగా ప్రదర్శించిన కోదాడ పట్టణ సీఐ రాము, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, సైదులు, క్రైమ్ టీంహెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సతీష్‌నాయుడులను డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అభినందించి, రివార్డు అందించారు.

స్వతంత్ర కమిషనర్‌ను నియమించాలి

ఏఐసీబీ ఉపాధ్యక్షుడు పానుగోటి చొక్కారావు



ఏపీ సీఎస్ విజయానంద్‌ను కలిసి వినతిని అందజేస్తున్న పానుగోటి చొక్కారావు

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల చట్టం కోసం స్వతంత్ర కమిషనర్‌ను ఏర్పాటుచేయాలని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏఐసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు, కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్ కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కావేటి విజయానంద్‌ను శుక్రవారం వారు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం దివ్యాంగుల కోసం రాష్ట్రం స్వతంత్ర కమిషన్‌ను నియమించాలని, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

సీజ్ చేసిన 483 కిలోల గంజాయి నిర్వీర్యం



కిల్లన్‌లో గంజాయిని బూడిద ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

మఠంపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 44 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.1.20 కోట్ల విలువైన 483 కిలోల గంజాయినీ ప్రభుత్వ, కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వీర్యం చేసినట్లు కమిటీ ఛైర్మన్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. మఠంపల్లి మండలంలోని నాగార్జున సిమెంట్ పరిశ్రమలో 1000 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన అత్యాధునిక సాధనంలో గంజాయిని నిర్వీర్యం చేసి బూడిద చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్ నివారణ సామాజిక బాధ్యత అని, గంజాయి వినియోగించడంతో యువత చెడుమార్గంలోకి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందన్నారు. డ్రగ్ రవాణా వినియోగం నేరమని, గంజాయి నివారణలో జిల్లా పోలీసుల కృషి మరువలేనిదన్నారు. ఎక్కడైనా డ్రగ్ విక్రయించినా, రవాణా చేస్తున్నా, వినియోగిస్తున్నా డయల్-100కు సమాచారం అందించాలన్నారు. డ్రగ్, గంజాయి నిర్మూలన, అనర్థాలపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రతీ తల్లిదండ్రులు పిల్లల నడవడికను, వారి అలవాట్లను గమనిస్తూ వ్యసనాలకు లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరావు, సూర్యాపేట, కోదాడ డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మట్టయ్య, హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, ఎస్ఐ యాకూబ్, పంచాయతీ కార్యదర్శులు సలీం, మామిడి స్వామి, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై కొరడా

(5వ పేజీ తరువాయి)

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పడుతోంది. అసలే గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు లేవు. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా, పన్నుల వసూళ్ల ఇతర ప్రభుత్వ పథకాల అమలు తీరు వంటి విధులు గ్రామకార్యదర్శులు చేయాల్సి ఉంది. దీంతో గైర్హాజరైన కార్యదర్శుల గ్రామాల్లో ప్రభుత్వ పథకాల నిర్వహణ సక్రమంగా జరిగేందుకు సమీప పంచాయతీల కార్యదర్శులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో కొంతమంది కార్యదర్శులు పనిభారం మోయలేక ఇబ్బందులు పడిన సందర్భాలూ అనేకం ఉన్నాయి.

పోటీ పరీక్షల కోసం గైర్హాజరు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు ఉద్యోగాల నియామకాల కోసం నోటిఫికేషన్లు జారీ చేసింది. అందులో గ్రూప్-1, గ్రూప్-2తో పాటు మరికొన్ని నోటిఫికేషన్లు ఉన్నాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు కొందరు ఆయా పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు విధులకు గైర్హాజరైనట్లు తెలుస్తోంది. ప్రొబేషనరీ సమయం కావడంతో నెలల తరబడి వారికి సెలవులు మంజూరు చేయడం వీలు కాదు. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటే ఒకవైపు విధులు నిర్వహించుకుంటూ మరోవైపు పోటీ పరీక్షలకు సిద్ధం కావడం ఇబ్బందిగా ఉంటుంది. దీంతో కార్యదర్శులు విధులకు గైర్హాజరై పోటీ పరీక్షలు రాసినట్లు సమాచారం.

నల్లగొండ కలెక్టర్ కఠిన నిర్ణయం

నల్లగొండ జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి అనుమతులు లేకుండా నెలల తరబడి విధులకు గైర్హాజరు కావడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి వారి సర్వీస్‌కు బ్రేక్ చేస్తూ కఠిన నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్ ఇటీవల మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల గుర్రంపోడు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి గైర్హాజరైన కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆరుగురిని విధుల నుంచి తొలగించడంతోపాటు ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న రెండు రోజులకే 99మంది పంచాయతీ కార్యదర్శుల సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ మరో సంచలన ఉత్తర్వులు జారీ చేశారు.

అయితే సర్వీస్ బ్రేక్ చేసినా, వారిని సస్పెండ్ చేయకుండా వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. అయితే సర్వీస్ బ్రేక్ చేయడంతో సెలవు కాలానికి సంబంధించిన సర్వీస్ కోల్పోతామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరినాట్లకు ఉత్తర భారత దేశ కూలీలు



భువనగిరి మండలంలో పొలంలో వరినాట్లు వేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలు

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)

యాదాద్రిభువనగిరి జిల్లాలోని మూసీ పరివాహకంలో వరినాట్లలో ఉత్తర భారతదేశ కూలీల సందడి ఇటీవల ఎక్కువగా కనిపిస్తోంది. మూసీ పరివాహక మండలాలైన భువనగిరి, వలిగొండ, పోచంపల్లి, బీబీనగర్ రామన్నపేట తదితర మండలాల్లో వరిసాగు అధికంగా ఉంటుంది. జిల్లాలో యాసంగి సీజన్ ఊపందుకోవడంతో నాట్లు వేసేందుకు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఇతర రాష్ట్రాల వారు అవకాశంగా మార్చుకుని తమదైన పని తీరుతో రైతులను మెప్పిస్తున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, అసోం, పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన కూలీలకే స్థానికులు వ్యవసాయ పనులు అప్పగిస్తున్నారు.

భోజనం,వసతి..

కొందరు మధ్యవర్తులు ఇతర రాష్ట్రాల కూలీలను తీసుకువచ్చి వారికి నివాసంతో పాటు భోజనవసతి కల్పిస్తున్నారు. ఎకరానికి రూ.5,500 నుంచి రూ.6వేల వరకు చెల్లిస్తున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించినందుకు కమీషన్‌తో పాటు ఇతర ఖర్చులు తీసుకుంటున్నారు.

పనిలో వ్యత్యాసం, వలస కూలీలపై ఆసక్తి

వలస కూలీల్లో సుమారు 10 నుంచి 15మంది వరకు ఉంటారు. వీరిలో ఇద్దరు వ్యక్తులు నారు అందిస్తుండగా మిగిలిన వారు నాట్లు వేస్తుంటారు. ఉదయం 6గంటలకే పొలంలోకి వెళ్లి రాత్రి చీకటిపడే వరకూ నాట్లు వేస్తారు. స్థానిక కూలీలు రోజుకు ఎకరం వరకే నాట్లు వేస్తారు. ఉదయం 10గంటలకు నాట్లు మొదలు పెడుతారు. వీరికి రవాణా ఖర్చులకు కూడా రైతులే చెల్లించాల్సి వస్తోంది. పైగా నారు అందించే బాధ్యత రైతుల మీదే పెడుతున్నారు. దీంతో స్థానిక కూలీలకు ఎక్కువగా చెల్లించాల్సి వస్తోందని వలస కూలీలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నెలకు రూ.30వేల సంపాదన

యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పరిధిలో సాగు విస్తీర్ణం పెరగడంతో పొరుగు రాష్ట్రాల కూలీలను నియమించుకుంటున్నారు. ఒకేసారి 10నుంచి 15మంది మగ, ఆడ కూలీలు పొలంలోకి దిగి గంటన్నరలోపే ఎకరం పొలంలో నాట్లు పూర్తి చేస్తున్నారు. స్థానిక కూలీలు రోజంతా చేసే పనిని ఈ కూలీలు గంటల వ్యవధిలోనే ముగించేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఎకరాకు రూ.5500నుంచి రూ.6వేల వరకు తీసుకుంటున్నారు. ఖర్చులు పోను నెలకు రూ.30వేల వరకు మిగులుతుందన్నారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ



ప్రాకార మండపంలో అమ్మవారి ఊరేగింపు

భువనగిరి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామికి సువర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని స్వయంభువులను మేల్కొల్పి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకించి, అర్చించారు. ప్రాకార మండపంలో హోమాది పూజలు సాంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళనీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సాంప్రదాయరీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి నిత్యపూజలు, యాగశాలలో చండీయాగం చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.35,65,824 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

వైష్ణవిదేవిగా రేణుకా ఎల్లమ్మ తల్లి



వైష్ణవిదేవి అలంకారంలో అమ్మవారు

కనగల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు వైష్ణవిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయంలో సహస్రనామార్చాన పూజలు జరిపి అమ్మవారికి సింహహారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె, ఒడిబియ్యం నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ఎద్దుల పందేల్లో సూర్యాపేటకు జిల్లాకు ప్రథమ బహుమతి

● బుల్లెట్ గెల్చుకున్న హుజూర్‌నగర్ గిత్తలు



బహుమతి సాధించిన గిత్తలు, బుల్లెట్‌తో రిటైర్డ్ ఎస్పీ సురేందర్‌రెడ్డి

హుజూర్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్పీ సుంకి సురేందర్ రెడ్డికి చెందిన ఒంగోలు జాతి గిత్తలు ప్రథమ బహుమతి సాధించాయి. సంక్రాంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లాలోని పొద్దుటూరులో గురువారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల స్థాయి సీనియర్ ఎద్దుల పందేలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సురేందర్‌రెడ్డికి చెందిన గిత్తలు 25 నిమిషాల్లో3,644 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం సాధించాయి. నిర్వాహకులు మొదటి బహుమతి కింద సురేందర్‌రెడ్డికి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాజీ పోలీస్ అధికారి సురేందర్‌రెడ్డిని అభినందించారు. ప్రతీ సంవత్సరం రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి బహుమతి సాధించడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వ కారణమన్నారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఒంగోలు జాతి గిత్తలను పెంచుతున్నట్లు తెలిపారు. తనకు వ్యవసాయమన్నా, ఎద్దుల పోటీలన్నా ఎంతో మక్కువ అన్నారు.

కబడ్డీ పోటీల విజేత ఆలగడప



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా హుజూర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని మాధవరాయనిగూడెంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. మొదటి బహుమతి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడపకు చెందిన వల్లబుదాసు సోమయ్య మెమోరియల్‌కు రూ.20వేల నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతి నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన మోదాల మురళి మెమోరియల్‌కు రూ.18 వేలు, మెమెంటో, తృతీయ బహుమతి మాధవరాయనిగూడెం గ్రామ కమిటీకి రూ.16వేలు, మెమెంటో, నాలుగో బహుమతి మునగాల మండలం బరాఖత్‌గూడెం మేకల రాజారావు టీమ్‌కు రూ.14 వేలు, మెమెంటో, ఐదవ బహుమతి గరిడేపల్లి మండలం సర్వారం ఫోకస్‌క్లబ్‌కు రూ.13 వేలు, మెమెంటో అందజేశారు. విజేతలకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు, నగదు అందజేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి



వెంకట్‌రెడ్డి (ఫైల్)

చిట్యాలరూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. ఈఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. చిట్యాల ఎస్ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొంగోనిచెర్వు గ్రామానికి చెందిన ఎంపల్ల వెంకట్‌రెడ్డి(54) గుండ్రాంపల్లి శివారులోని దొడ్ల డెయిరీ కంపెనీలో 10 ఏళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామం బొంగోనిచెర్వు కాగా ఆయన కుటుంబంతో వెలిమినేడులో నివాసముంటున్నాడు. వెంకట్‌రెడ్డి డెయిరీకి చెందిన ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించేందుకు వెంకట్‌రెడ్డి అదే ట్రాక్టర్‌ను నడుపుకుంటూ చిట్యాలకు బయల్దేరాడు. మార్గమధ్యలో వెలిమినేడు శివారులో వెనుక నుంచి వచ్చిన ఖమ్మం జిల్లాకు చెందిన ఆర్టీసీ రాజధాని బస్సు వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో ట్రాక్టర్ బోల్తాపడగా ట్రాక్టర్‌ను నడుపుతున్న వెంకట్‌రెడ్డి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, వివాహమైన కూతురు ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్షకై నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి పూర్తయ్యాక కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు అనిల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొడ్ల డెయిరీ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా

దొడ్ల డెయిరీ పనిమీద ట్రాక్టర్‌పై వెళ్తున్న వెంకట్‌రెడ్డి మృతిచెందగా విధుల్లో ఉన్న సమయంలో మృతిచెందటంతో ఆ బాధ్యత డెయిరీ కంపెనీదేనంటూ గుండ్రాంపల్లి శివారులో గల డెయిరీ వద్ద మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా చేశారు. వారికి తోడుగా బొంగోనిచెర్వు, వెలిమినేడుకు చెందిన గ్రామస్థులు మద్దతు తెలిపారు. సమాచారాన్ని తెలుసుకున్న చిట్యాల పోలీసులు చేరుకుని యాజమాన్యంతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామని, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజాపేట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రఘునాథపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు, ఏఎస్ఐ మైసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రఘునాథపూర్ గ్రామానికి చెందిన బొంత వెంకటేశ్(35) కూలీగా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా మద్యానికి అలవాటు పడడంతో తరచూ కుటుంబంలో మనస్పర్థలు తలెత్తాయి. సంక్రాంతి పండుగకు భార్య రజని తన పిల్లలతో తల్లిగారింటికి వెళ్లింది. మనస్థాపానికి గురైన వెంకటేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం రాత్రి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగు పొరుగు వారు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచాన్ని అందించారు. భార్య రజని ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెర్వుగట్టులో మతిస్థిమితం లేని మహిళ..

నార్కట్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని గుర్తు తెలియని ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గుట్టపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 సంవత్సరాల వయసున్న మతిస్థిమితం లేని మహిళ చెర్వుగట్టు ఘాట్ రోడ్‌పై శివుని విగ్రహం సమీపంలో షెడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకొంది. ఈ విషయాన్ని గౌరీ సదన్ వద్ద అద్దె గదుల బుకింగ్ క్లర్క్ విధులు నిర్వహిస్తున్న చీర నరేశ్ సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి దృష్టికి తీసుకువెళ్లాడు. ఇంద్రసేనారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



యాదగిరి (ఫైల్)

భువనగిరి రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన భువనగిరి మండలం అనాజీపురం బస్టాండ్ వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన భూడిద యాదగిరి (50) భువనగిరి మండలం పగిడిపల్లి రైల్వే స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, మార్గమధ్యలోని అనాజీపురం బస్టాండ్ వద్ద అతివేగంగా వెనుక నుంచి వచ్చిన లారీ ఇతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాదగిరిని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇక్కడి నుంచి సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతుని బావ బొల్లేపల్లి మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వారణాసి సంతోష్‌కుమార్ తెలిపారు.

కొండగడపలో విషాద ఛాయలు



మృత దేహాలను చూడటానికి వచ్చిన ప్రజలు



కృష్ణమూర్తి ఇంటి ముందు ఉంచిన మృతదేహాలు

మోత్కూరు, జనవరి 17: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన శ్యామ్‌శెట్టి కృష్ణమూర్తి కుటుంబం మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంతో చిన్నాభిన్నమైంది. కృష్ణమూర్తి కుటుంబం 12 ఏళ్ల క్రితం బతుకు దెరువు కోసం హైదరాబాద్ వెళ్లి సరూర్‌నగర్‌లోని గ్రీన్‌పార్కు ఏరియాలో కిరాణం దుకాణం నడుపుకుంటూ జీవనం సాగి స్తున్నారు. ఈ నెల 16న రాత్రి షిర్డీ-ఔరంగాబాద్ రూట్‌లో గంగాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణ మూర్తి భార్య ప్రేమలత, పెద్ద కూతురు తొలుపు నూరి ప్రసన్నలక్ష్మి, మనుమరాలు (కూతురు బిడ్డ) తొలుపునూరి అక్షిత, మనుమడు (కుమారుడి కొడు కు) అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణమూర్తి, కుమా రుడు వెంకన్న, అల్లుడు తొలుపునూరి శ్రీనివాస్, మనుమరాలు (కూతురు బిడ్డ) శరణ్య తీవ్రం గా గాయపడి ఔరంగాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొం దుతున్న విషయం తెలిసిందే. మృత దేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధు వులకు అప్పగించారు. మృతదేహాలను శుక్రవారం వారి స్వగ్రామం కొండగడపకు తీసుకవచ్చారు.

బంగారం, డబ్బులు అపహరణ

రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెంది, మరో నలుగురు తీవ్రంగా గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించే క్రమంలో కొందరు వ్యక్తులు తమ చేతివాటం ప్రదర్శించారు. మహిళల మెడలో ఉన్న సుమారు ఆరేడు తులాల బంగారు ఆరణాలు, మంగళసూత్రాలు, చేతి వేళ్ల ఉంగరాలు కొట్టేశారని చెబుతున్నారు. ఒకరి జేబులో ఉన్న రూ.13,500 కూడా కొట్టేశారంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రేమలతపై నుంచి పోయిన బంగారు ఆభరణాలను మాత్రం రికవరీ చేశారని చెబుతున్నారు. ఆరేడు సెల్‌ఫోన్లు కూడా పోయాయన్నారు.

ఆగిన అంత్యక్రియలు

కృష్ణమూర్తి భార్య ప్రేమలత, కుమార్తె ప్రసన్న లక్ష్మి, మనుమరాలు అక్షిత, మనుమడు వైద్విక్ మృత దేహాలను పోస్టుమార్టం అనంతరం శుక్రవారం ఉదయం కొండగడప గ్రామానికి తరలించారు. ప్రేమలత భర్త కృష్ణ మూర్తి, కుమారుడు వెంకన్న, మరో మృతురాలు ప్రసన్న లక్ష్మి భర్త శ్రీనివాస్, కుమార్తె శరణ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వారు కడసారి చూ సు కోవడానికి వచ్చేందుకు ప్రయత్నిస్తుండటంతో మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించకుండా ఆపారు. మృతదేహాలను ఐస్‌బాక్సుల్లో పెట్టారు. శుక్రవారం రాత్రి వరకు వారెవరూ కొండ గడపకు చేరుకోలేదు.

హృదయాల కలచివేత

ప్రేమలత, ప్రసన్నలక్ష్మి, అక్షిత మృతదేహాలను ఐస్‌బాక్సుల్లో ఉంచి కృష్ణమూర్తి ఇంటి వాకిట్లో వరుసగా ఉంచారు. ఆరు నెలల చిన్నారి వైద్విక్ మృత దేహాన్ని నానమ్మ శవం పక్కన పెట్టడంతో ఆ దృశ్యం చూసే వారిని కంటతడిపెట్టించింది. గ్రామస్తులు భారీగా తరలివచ్చి అక్కడి దృశ్యాన్ని చూసి కంటతడిపెట్టారు. కొండగడప గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్యే మందుల సామేలుతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు వచ్చి వారి మృతి పట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద సంఘటనపై సమగ్ర విచారణ జరిపి ప్రమాదానికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలని, పోయిన నగలు, డబ్బు రికవరీ చేసి అప్పగించాలని, మహారాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తగిన ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

మదర్ డెయిరీపై రాజకీయ రగడ

(5వపేజీ తరువాయి)

చేస్తోంది. గత పాలకమండలి ఆధ్వర్యంలో పదేళ్లలో రూ.35కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని లెక్కలతో సహా చెబుతోంది.

పదేళ్లల్లో రూ.35 కోట్ల నష్టం:

గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్



భువనగిరి సమావేశంలో మాట్లాడుతున్న మదర్‌డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి,డైరెక్టర్లు రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం,నర్సింహులు.

మదర్ డెయిరీ గత పదేళ్లలో రూ.35కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని, దీంతో పాడి రైతులకు చెల్లింపులు నిలిచి ఇబ్బందులు పడుతున్నారని మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం భువనగిరిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకమండలి తీసుకున్న నిర్ణయాల్లో పలు అవకతవలు, అక్రమాలు జరిగాయని, దీంతో సంస్థ అప్పుల్లో చిక్కుకుందన్నారు. సంస్థ పాలసేకరణ ఇప్పటివరకు 65వేల లీటర్లు దాటలేదని, అయితే గత పాలకసభ్యులు 1.20లక్షల లీటర్లు సేకరించామని చెప్పడం శోచనీయమన్నారు. ఎవరి హయంలో ఎం త అప్పులయ్యాయి, ఎంత నష్టం జరిగిందో త్వరలోనే అన్ని వివరాలు సభ్యులకు తెలియజేస్తామన్నారు. డెయిరీ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, రైతులకు నాలుగు నెలలుగా రూ.20కోట్ల మేరక పాల బిల్లలు చెల్లించాల్సి ఉందన్నారు. సంస్థ బజారున పడేలా గత పాలకు లు వ్య వ హ రిం చా ర ని విమర్శించారు. సహకార చట్టం ప్రకారం సంస్థ నష్టాల్లో ఉన్నప్పుడు కొత్తగా ఉద్యోగాలుగానీ, పదోన్నతులు గానీ కల్పించకూడదని, అయితే నష్టాల్లో ఉన్న డెయిరీ రెండేళ్ల కాలంలో ఇష్టానురీతిలో ఉద్యోగులను నియమించారని, తద్వారా సంస్థపై మరింత ఆర్థిక భారం పడిందన్నారు. ఎలాంటి అర్హతలు లేకున్నా 250మందికి ఉద్యోగాలు కల్పించారని ఆరోపించారు. గత పాలకులు సంస్థకు చెందించిన భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి తెచ్చిన రుణాలకు నెలకు రూ.5లక్షల మేరకు వడ్డీ చెల్లిస్తున్నామని, ఏడాదికి రూ.5కోట్లు వడ్డీకే పోతాయన్నారు. డెయిరీ వార్షిక నివేదికల్లో అప్పటి పాలకవర్గం ఒకటి లాభాలు ఉన్నట్టుగా, మరోటి నష్టాల్లో ఉన్నట్టు రెండు తప్పుడు నివేదికలురూపొందించిందని, వీటి ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు పొందేవారని ఆరోపించారు. అందుకు సంబంధించి ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని, వీటిని పాలకవర్గ సభ్యులకు తెలియజేస్తామని తెలిపారు. ప్రస్తుతం డెయిరీ భూములు విక్రయిస్తే తప్ప రైతులకు డబ్బు చెల్లించే పరిస్థితి లేదన్నారు. డెయిరీ రూ.35కోట్ల అప్పులతో పాటు రైతులకు సంబంధించి రూ.12 కోట్ల షేర్‌క్యాపిటల్‌ను గత పాలకవర్గం వినియోగించుకుందన్నారు. మాజీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి హయాంలో రెండేళ్లలో రూ.7.48కోట్ల మేరకు నష్టం వాటిల్లిందన్నారు. సంస్థ ఒక పక్క నష్టాల్లో ఉంటే, మరోపక్క లాభాల్లో ఉన్నట్టు రూ.45లక్షల ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించారని ఆరోపించారు. సమావేశంలో మదర్‌డెయిరీ డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, మండడి ప్రభాకర్‌రెడ్డి, కల్లెపల్లి శ్రీశైలం, పుప్పాల నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కొనసాగుతున్న వాహనాల రద్దీ

● ఏపీ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల బారులు

చౌటుప్పల్ టౌన్/ చౌటుప్పల్ రూరల్ జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారి పై శుక్రవారం కూడా వాహనాల రద్దీ కొనసాగింది. సంక్రాంతి పండుగ అనంతరం, సెలవులు ముగియటంతో స్వస్థలాలకు వెళ్లినవారు హైదరాబాద్‌కు బయల్దేరారు. నల్లగొండ జిల్లా చిట్యాల, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మధ్య ఉన్న హోటల్స్ వద్ద పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిపి రాత్రి వేళ హైద రాబాద్‌కు చేరుకుంటున్నారు.

● చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ నెల కొంది. టోల్‌గేట్ వద్ద వాహ నాలు బారులు తీరాయి. 16 గేట్లకు 12 గేట్ల ద్వారా హైదరాబాద్ వైపు వాహ నాలను మళ్లించారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ వైపు 20వేల వాహనాలు వెళ్తుండగా శుక్రవారం మరో 20వేల వాహనాలు అదనంగా వెళ్లినట్లు టోల్‌గేట్ నిర్వహకులు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు భారీగా పోలీసులు టోల్ గేట్ నిర్వహణ సంస్థ డీఎన్ఆర్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

● కోదాడరూరల్, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా రామాపురం క్రాస్ రోడ్డుతో పాటు చిమిర్యాల క్రాస్ రోడ్డు దుర్గాపురం బైపాస్, కట్టకమ్మగూడెం బైపాస్, కొమరబండ వై జంక్షన్ వద్ద బందోబస్తు కొనసాగిస్తున్నారు. ఉదయం నుంచే వాహనాలు విజయవాడ వైపు నుంచి రామాపురం క్రాస్ రోడ్డు వద్దకు చేరుకొని అక్కడి నుంచి కోదాడ బైపాస్ మీదుగా హైదరాబాద్ కదిలి వెళ్తున్నాయి. ఈ వాహనాల రద్దీ రేపటి వరకు ఉంటుందని పోలీసులు పేర్కొంటున్నారు. హైదరాబాద్- విజయవాడ మధ్య 1,500కు పైగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కోదాడ డిపో నుంచి కూడా 36 బస్సులు నడుపుతున్నట్లు డీఎం హర్ష తెలిపారు. ఇవి విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే వాహనాల రద్దీకి అనుకూలంగా కోదాడ డిపో నుండి బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

● ఎస్ఆర్‌టీఆర్ఐ సంస్థ చైర్మన్ డాక్టర్ కిషోర్‌రెడ్డి



సర్టిఫికెట్లు అందజేస్తున్న చేస్తున్న డాక్టర్ కిషోర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్న స్వామి రామానందసంస్థలోని కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.కిషోర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో రిమిని స్ట్రీట్ ఇండియా ఆపరేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో బేసిక్ బ్యూటీషియన్ కోర్సు, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ టైలరింగ్ శిక్షణ పొందిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్ల పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామీణ నిరుద్యోగ యువతీ యు వకులకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పలు శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి, శిక్షణాధికారి విహారికృష్ణ, లలిత, విజయలక్ష్మి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తైక్వాండోలో కనగల్ విద్యార్థిని ప్రతిభ



కనగల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తైక్వాండోలో పోటీల్లో నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని సంజన జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తుంది. కనగల్ గ్రామానికి చెందిన దోమలపల్లి సైదులు, పారిజాత దంపతుల రెండో కుమార్తె దోమలపల్లి సంజన మునుగోడు జ్యోతిరావుఫూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సంజన చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ తన ప్రతిభను చాటుతోంది. తైక్వాండోలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పథకాలను సాధించింది. ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం, హైదరాబాద్ సీఎం కప్ పోటీల్లోనూ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. పేద కుటుంబానికి చెందిన సంజన తైక్వాండోలో రాణిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పతకాలను సాధిస్తూ కనగల్ గ్రామానికి గుర్తింపును తెస్తున్న సంజనను పలువురు గ్రామస్థులు అభినందిస్తున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	561.80 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	6,556 క్యూసెక్కులు
కుడికాల్వకు	9,800 క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	12,977 క్యూసెక్కులు
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
పూర్తి అవుట్‌ఫ్లో	25,177 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	41.24 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

- మేళ్లచెర్వు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	640.45 అడుగులు
ఇన్‌ఫ్లో	75.56 క్యూసెక్కులు
కాల్వలకు నీటి విడుదల	45.56 క్యూసెక్కులు

- కేతేపల్లి

రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): బొలెరోలో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి పట్టుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు శుక్రవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా సారబండతండాకు చెందిన హరిలాల్ దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావి, పద్మట్‌పల్లి, పరిసర గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. అనంతరం బొలేరోలో స్వగ్రామానికి తరలిస్తుండగా పద్మట్‌పల్లి వద్ద వాహనాన్ని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి రేషన్ బియ్యాన్ని దేవరకొండ డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్‌కు అప్పగించి హరిలాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రాణం మీదకు తెచ్చిన సరదా

● విద్యుత్ తీగలకు చిక్కిన పతంగి

● తీయబోయిన బాలుడికి విద్యుదాఘాతం

నల్లగొండ క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పతంగి సరదా ఓ బాలుడి ప్రాణం మీదకు తీసుకువచ్చింది. విద్యుత్ తీగలకు చిక్కుకున్న పతంగిని తీయడానికి వెళ్లిన ఓ విద్యార్థి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డులో ఉన్న 18వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన కందగట్ల కృష్ణగీత దంపతులకు కుమార్తె, కుమారుడు నవదీప్ ఉన్నారు. నవదీప్ పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తమ ఇంటి డాబాపై గాలిపటం ఎగుర వేస్తుండగా, పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు చిక్కుకుంది. ఇనుప రాడ్డుతో ఆ గాలిపటాన్ని తీసే క్రమంలో వైర్లకు తాకి విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు నవదీప్‌ను 108 వాహనంలో జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

రామన్నపేటలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు శ్యాంసుందర్‌రావు

రామన్నపేట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నారాయణాద్రి, ఫలక్‌నుమా, డెమో రైళ్లను ఆపాలని కోరుతూ శుక్రవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. రైళ్లు ఆపక పోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ రైళ్లను తక్షణమే ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీ. శ్యాంసుందర్‌రావు, నకిరేకల్ ఇన్‌చార్జి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి తాటి పాముల శివకృష్ణ, మండలాధ్యక్షుడు బండ మధు కర్‌రెడ్డి, నార్కట్‌పల్లి మండలాధ్యక్షుడు శంకర్, వెంకటేశం ఉన్నారు.

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

కంపుకొడుతోంది

మురుగునీటి సమస్యను వివరిస్తున్న స్థానికులు



- అధ్వానంగా పద్మానగర్ రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి
- మురుగు నీటి నిల్వలో రాకపోకలకు అంతరాయం
- 35, 17వ వార్డు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- దుర్వాసన, దోమలతో సతమతం

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని పద్మానగర్ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో మురుగు నీటి నిల్వలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 17,35 వార్డుల మధ్యలో ఉన్న ఈ అండర్ పాస్ బ్రిడ్జీతో ప్రజలకు ఉపయోగంగా ఉండాల్సింది పోయి నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కాకపోయినా ఎప్పుడో కురిసిన వర్షపు నీటితో పాటు సమీపంలోని మిల్లు నుంచి వెలువడుతున్న వ్యర్థపు నీరు అండర్ పాస్ బ్రిడ్జీకి చేరుతుందని స్థానికులు వాపోతున్నారు. రైల్వే అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన బ్రిడ్జి వల్ల ప్రజలకు ఉపయోగం లేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి వర్షపు నీరు వచ్చినప్పుడు ఆ నీరు అండర్ పాస్ నుంచి వెళ్లిపోయేలా సమీపంలో నీటి నిల్వల కోసం ట్యాంకు నిర్మాణం ఉంటుంది. అయితే ఇక్కడ కూడా ట్యాంకు నిర్మాణం చేపట్టినా అవుట్ లెట్ వద్ద మూసుకుపోవడంతో నీరు బయటకు పోవడం లేదు. స్థానికులు అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పద్మానగర్ అండర్ పాస్ బ్రిడ్జీ సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నీటి నిల్వలతో నిరుపయోగంగా అండర్ పాస్

35వ వార్డులో ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి సమీపంలోనే 17వ వార్డు శివారు ఉంది. 35వ వార్డు నుంచి 17వ వార్డుకు అటూ ఇటూ ప్రజలు వెళ్లాలంటే ఈ అండర్‌పాస్‌ను ఉపయోగించుకోవాల్సి ఉంది. అదేవిధంగా 35వ వార్డులో ఎవరైనా చనిపోయి నా వారి అంత్యక్రియలు నిర్వహించడానికి అం డర్ పాస్‌లో నీరు నిల్వల వల్ల అటు నుంచి వెళ్లలేక మూడు, నాలుగు కిలోమీటర్లు తిరిగి శ్మశానవాటికకు చేరుకోవాల్సి పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. అండర్‌పాస్‌లోని నీటి వల్ల టూ వీలర్‌పై వెళ్లే వారు బ్రిడ్జిని ఆనుకొని ఉన్న ఎత్తు దిమ్మెపై నుంచి వెళ్తున్నారు. చాలామంది ప్రమాదవశాత్తు ఆ నీటిలో పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. చిన్న పిల్లలు ఏ సమయంలో ఎప్పుడూ అండర్‌పాస్‌లోకి వెళ్లి ప్ర మాదాలకు గురవుతారోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ బ్రిడ్జి కింది నుంచి రాకపోకలు నిలిచిపోవడంతో కొంతమంది వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. మద్యం తాగి ఆ బాటిళ్లను ఆ మురుగు నీటిలోనే వేస్తున్నారు. ఈ అండర్ పాస్ బ్రిడ్జిని ఒక వైపు నుంచి కాకుండా రెండు వైపులా కూడా నిర్మించినా ప్రజలకు ఉపయోగం లేకుండా పోయింది. స్థానికులు అనేక సార్లు మునిసిపల్ అధికారులతో పాటు, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సమాచారం.



అండర్‌పాస్‌లో పేరుకుపోయిన మురుగునీరు

నీటి నిల్వలు లేకుండా చేస్తాం

అండర్ పాస్ బ్రిడ్జి కింద అవుట్‌లెట్‌లో మట్టి లేదా ఇతర వస్తువులతో జామ్ కావడం వల్ల సమస్య వచ్చి ఉంటుంది. ఈ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం. ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించడం కోసం ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేస్తాం. అండర్ పాస్ బ్రిడ్జిలో నీటి నిల్వలు లేకుండా చూస్తాం.

సయ్యద్ ముసాబ్ అహ్మద్,
మునిసిపల్ కమిషనర్ నల్లగొండ

దుర్వాసన, దోమలతో ఇబ్బందులు



అండర్‌పాస్ బ్రిడ్జిలో మురుగు నీటి వల్ల దుర్వాసనతో పాటు దోమల బెడద తీవ్రంగా ఉంటుంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. 35వ వార్డు, 17వ వార్డు ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే నీటి నిల్వలు లేకుండా చేయాలి. స్థానికంగా నివాసం ఉంటున్న తమకు దోమల బెడద నుంచి కాపాడాలి. పలుమార్లు ప్రమాదాలు కూడా జరిగాయి. మురుగు నీటి వల్ల పాములు, తేళ్లు కూడా వస్తున్నాయి.

కృష్ణవేణి, పద్మానగర్

నీరు నిల్వ లేకుండా చేయాలి



మురుగు నీటిని నిల్వ లేకుండా బయటకు పోయేలా చేయాలి. అసలు అండర్ పాస్ బ్రిడ్జి వల్ల ఉపయోగం లేకుండా పోయింది. దోమల వలన రోగాల బారిన పడుతున్నాం. మురుగునీటి వాసనతో సతమతమవుతున్నా ఎవరూ స్పందించడం లేదు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని ఇబ్బందుల నుంచి ప్రజలు బయటపడేలా చూడాలి. అనేక సార్లు ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

బసవయ్య, పద్మానగర్

20న అనియత విద్యా బోధకుల సమావేశం

కనగల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనియత విద్యా పథకం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు పర్సబోయిన పర్వతాలు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక సమావేశానికి జిల్లా అనియత విద్యా పథకంలో పనిచేసిన సూపర్‌వైజర్లు, బోధకులు హాజరుకావాలని కోరారు. ప్రతిఒక్కరూ తమ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ, సర్వీస్ సర్టిఫికెట్, బయోడేటా కాపీలను తీసుకురావాలని సూచించారు. సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు సమ్మిరెడ్డి, అహ్మద్ హాజరుకానున్నట్లు తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

మర్రిగూడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో చేరి చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని గురుకుల పాఠశాల సిబ్బంది మహేశ్వరం మారయ్య తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలో గురుకుల ప్రవేశాల కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. వెనకబడిన విద్యార్థులు 5వ తరగతి నుంచి 9వ తరగతి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

యోగ, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

- సహజ యోగా ట్రస్టు రాష్ట్ర కో ఆర్డినేటర్ గౌరీకృష్ణ



పట్టణంలో సహజయోగ ప్రచారరథం ఊరేగింపులో పాల్గొన్న గౌరీకృష్ణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగ, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సహజ యోగా ట్రస్టు రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ అన్నారు. సహజయోగ ప్రచార రథం శుక్రవారం నల్లగొండ పట్టణంలో ప్రవేశించి పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యాన విధానాన్ని మాతాజీ నిర్మలాదేవీ ప్రపంచానికి పరిచయం చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చైతన్య రథాలతో సహజ యోగా ధ్యాన విధానాన్ని ప్రజలకు పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో 15 రోజుల పాటు పర్యటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రాంమోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వినయ్‌కుమార్, మంగారెడ్డి, కృష్ణ, సుధాకర్‌రెడ్డి సూర్యనారాయణ, ఇందిర, హైమావతి పాల్గొన్నారు.

అనుమతి లేని దుకాణాల తొలగింపు



చెర్వుగట్టులో పార్వతీ మాత గుడి వద్ద అనధికార షాపులను తొలగిస్తున్న సిబ్బంది

నార్కట్‌పల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేవస్థాన స్థలంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న దుకాణాలను చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం అధికారులు, సిబ్బంది శుక్రవారం తొలగించారు. గుట్ట కింద పార్వతీ అమ్మవారి గుడికి వెళ్లే దారిలో కుడివైపు దేవస్థానానికి చెందిన కొంత ఖాళీ స్థలం ఉంది. అయితే గ్రామానికి చెందిన కొందరు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి దేవస్థానం అనుమతి లేకుండా చిరు వ్యాపారులు అనధికారికంగా తోపుడు బండ్లను, టేబుళ్లను ఏర్పాటు చేసుకుని కొంత కాలంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి దేవస్థానానికి చెందిన స్థలాలు, షాపుల్లో వ్యాపారాలు చేసుకోవడానికి ప్రతీ యేటా టెండర్ పద్ధతి ద్వారా షాపులన కేటాయిస్తారు. అయితే పక్కా భవనాలలోని షాపులకు టెండర్ నిర్వహించి కేటాయించగా ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తోడు చిరు వ్యాపారులు కావడంతో దేవస్థానం అధికారులు కూడా ఇంతకాలం కొంత చూసీ చూడనట్లు వ్యవహరించారు. వారి నుంచి ముడుపులు స్వీకరించి అనధికారికంగా షాపుల నిర్వహణకు సహకరిస్తూ టెండర్ ద్వారా దేవస్థానానికి వచ్చే ఆదాయానికి చెర్వుగట్టు దేవస్థానం అధికారులు గండి కొడుతున్నారని కొందరు కలెక్టర్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆమె సూచనల మేరకు అనధికారికంగా నిర్వహిస్తున్న చిరువ్యాపారుల దుకాణాలను ఈవో సిరికొండ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో తొలగించారు. ఖాళీ చేసిన స్థలాన్ని ఇతరులు ఆక్రమించుకోకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



క్రీడాకారులకు టీ షర్టులు అందజేస్తున్న పోల్దాస్ నరేష్

శాలిగౌరారం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకొని పోటీల్లో రాణించాలని తుంగతుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోల్దాస్ నరేష్ అన్నారు. శాలిగౌరారంలో శుక్రవారం వాలీబాల్ క్రీడాకారులకు దాత పోల్దాస్ నరేష్ టీ షర్టులను ఆయన అందజేసి మాట్లాడారు. క్రీడాకారులు నిత్యం వ్యాయామం చేస్తూ బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేష్, నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు బండారు మహేష్, యూత్ క్లబ్ అధ్యక్షుడు బండారు మహేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు వేముల భరత్, మిర్యాల సాయి, నిమ్మల నితిన్, మాదగోని గోపి, క్లబ్ సభ్యులు నిమ్మల శంకర్, బండారు మహేష్, నిమ్మల మధు, చిత్తలూరి సాయిభార్గవ్, సుల్తాన్ మహేష్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

అభిషేకం పాత్ర బహూకరణ

నార్కట్‌పల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వారిజాల వేణుగోపాల స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దోసపాటి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని సన్‌షైన్ అవెన్యూ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పు రాము స్వరూప దంపతులు ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులను అభిషేకించేందుకు అవసరమైన పాత్రను శుక్రవారం బహూకరించారు. దంపతులను ఆలయ అర్చకుడు కారంపూడి వెంకటాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేష్, పసునూరి శ్రీనివాస్, దోసపాటి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగు చేయని భూముల సర్వే పక్కాగా ఉండాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కేతేపల్లి, మర్రిగూడ, రామగిరి, శాలిగౌరారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగుకు యోగ్యం కాని భూముల సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. రైతుభరోసా పథకం అమలుకు చేపట్టిన వ్యవసాయ యోగ్యంకాని భూముల సర్వేను ఆయన ఆర్డీవో అశోక్‌రెడ్డితో కలిసి శుక్రవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్‌లో గల ఫామ్‌ల్యాండ్స్‌లో నిర్వహిస్తున్న సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎన్ని సర్వే నెంబర్లలో ఎన్ని ఎకరాలు సాగుకు యోగ్యంకాని భూముల జాబితాలో ఉన్నాయి? ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో ఎన్ని ఎకరాల భూములు సర్వే పూర్తి చేశారని వివరాలు అధికారులు, సర్వే బృందం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భూభారతి ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న వివరాల మేరకు సర్వే చేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే వివరాలు తప్పులకు ఆస్కారం లేకుండా పక్కాగా ఉండాలన్నారు. భూభారతి నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న సర్వే నెంబర్లలోని భూములన్నీ సర్వే చేయాలన్నారు. సర్వేలో అనర్హులను గుర్తించి రైతుభరోసాలో ప్రభుత్వ డబ్బు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత సర్వే బృందాలదేనన్నారు. సర్వే వల్ల అర్హులైన రైతులకు అన్యాయం జరగకుండా ఉండాలన్నారు. అదన పు కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఏవో బి.పురుషో త్తం, సర్వే సిబ్బంది ఉన్నారు.



భూముల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి



మర్రిగూడ: వట్టిపల్లిలో భూములను పరిశీలిస్తున్న అధికారులు

పొరపాట్లకు అవకాశం ఇవ్వవద్దు

ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాల పరిశీలన అధికారులు పొరపాట్లకు అవకాశం ఇవ్వవద్దని మర్రిగూడ మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు అన్నారు. మండలంలోని లెంకలపల్లి, ఎరుగండ్లపల్లి, వట్టిపల్లి, శివన్నగూడ, మర్రిగూడ గ్రామాల్లో రైతుభరోసా సర్వే కార్యక్రమాన్ని ని ర్వహించారు. రైతులు రైతుభరోసా పథకం కింద భూభారతి కింద డౌన్‌లోడ్ చేసుకున్న భూముల వివరాలు వ్యవసాయ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో హేమలత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయకులు పలువురు రైతులు ఉన్నారు.

పారదర్శకంగా రేషన్ కార్డుల సర్వే

నల్లగొండ పట్టణంలో జరుగుతున్న రేషన్ కార్డుల సర్వే పారదర్శకంగా జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. పట్టణంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని ఆయ న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే పారదర్శకంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో 48 వార్డులకు గాను 1545 దరఖాస్తులు రాగా 50శాతం పైగా క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. మిగిలిన సర్వే ఈ నెల 20వ తేదీలోగా చేస్తామన్నారు. దరఖాస్తుదారులు అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

● శాలిగౌరారం మండలం అడ్లూరు, వల్లాల గ్రామాల్లో అధికారులు చేపడుతున్న రేషన్‌కార్డు లబ్ధిదారుల సర్వేను జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. రేషన్‌కార్డులు ప్రక్రియ నిరంతరం ఉంటుందన్నారు. నిబంధనలకు లోబడి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. తరి మూడున్నర, మెట్ట ఐదు ఎకరాలలోపు, సంవత్సర ఆదాయం లక్షన్నరలోపు ఉంటే రేషన్ కార్డులకు అర్హులని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మాన్యానాయక్, తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో సుధాకర్, ఎంపీవో అల్లూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

- శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరం లాంటిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి పథకం ద్వారా సహాయం పొందిన 41 మంది నిరుపేదలకు రూ.13.36లక్షల విలువైన చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వేలాది మంది పేదలకు సహాయం అందుతుందని ఆయన తెలిపారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

చండూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దశరథ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 119 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీటీ నిర్మలాదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ చేయకుండా నియామకాలు చేపట్టవద్దు



మహాగర్జన కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిట్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఎమ్మార్పీఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రామాంజీ సైదులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈ నెల 19వ తేదీన జరిగే మాదిగల మహాగర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం చిట్యాలలో ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో మాదిగలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, డప్పు, చెప్పు ఉత్పత్తిదారులకు నాలుగు వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. అసైన్డ్ భూములను రెగ్యులర్ చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు పోలేపల్లి సత్యనారాయణ, అవిరెండి సోములు, బరాల యాదగిరి, పొన్నాల రాంబాబు, నాగిళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాపల్లి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

నార్కట్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలం శాపల్లి కమలాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం పాల్గొన్నారు. మూలవిరాట్‌ను దర్శించిన చిరుమర్తిని ఆలయ వంశపారంపర్య అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యులు ఆశీర్వదించి స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో కర్నాటి ఉపేందర్, నర్సయ్య, యానాల అశోక్‌రెడ్డి, దోసపాటి విష్ణుమూర్తి, అలుగుబెల్లి సత్తిరెడ్డి బొబ్బలి దేవేందర్, జాని తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు పేదలకు అందేలా కృషి : బీఎల్ఆర్

మాడ్గులపల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను పేద ప్రజలందరికీ అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అ న్నారు. మండలంలోని పాములపాడు, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, ఆగామోత్కూర్, గుర్రప్పగూడెం, భీమనపల్లి, కల్వలపాలెం, బొమ్మకల్, సీత్యాతండా, తోపుచర్ల, ఇసుకబావిగూడెం, గండ్రవానిగూడెం, కుక్కడం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామాల్లోని ప్ర జలను, నాయకులను కలిసి గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. ఆరు గ్యారెంటీ పథకాలు, మన ఊరు- మన ఎమ్మెల్యే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుచేస్తున్న రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రతి ఒక్కరికీ అందించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను తిరిగి జరగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో మన ఊరు -మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి గ్రామానికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా పేదలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, మునగాల చంద్రారెడ్డి, సత్తిరెడ్డి, యాదగిరి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు



ధ్వంసమైన డ్రైనేజీ పైప్‌కు సిమెంట్‌తో మరమ్మతులు చేసిన దృశ్యం

నార్కట్‌పల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టులోని లక్ష్మీ నరసింహస్వామి గుడి వద్ద ప్రమాదకరంగా మారిన డ్రైనేజీకి పంచాయతీ అధికారులు శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేశారు. డ్రైనేజీకి ఉన్న సిమెంట్ గూన పైప్ ధ్వంసమై ఏర్పడిన రంధ్రంతో ప్రమాదం పొంచి ఉందని 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో కె.ఉమేశ్‌చారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి గీతాంజలి ధ్వంసమైన డ్రైనేజీ పైపునకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. జాతర పూర్తయిన తర్వాత పక్కా మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మునుగోడులో ఈ నెల 19వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడులోని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో శంకరా కంటి ఆస్పత్రి, ఫినిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాల పరిధిలోని ప్రజలు వచ్చేందుకు ప్రత్యేకంగా ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు భీమనపల్లి సైదులు, పాల్వాయి జితేందర్‌రెడ్డి, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, జంగిలి నాగరాజు, యాదగిరి, రాజేష్, మునుగోటి సాయికుమార్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేకల ప్రమోద్‌రెడ్డి

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

కట్టంగూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరుకు చెందిన ఎరకల సైదులు అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న పెద్ది ఫౌండేషన్ చైర్మన్ పెద్ది బాలనర్సింహ శుక్రవారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పోగుల నర్సింహ, పొడిచేటి సైదులు, రెడ్డిపల్లి మనోహర్, నోముల వెంకటేశ్వర్లు, సైదులు, యాదయ్య, అంజయ్య, లింగయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.139	220	250
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 17.4



- పైసలివ్వనిదే పనులు జరగవు
- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని తీరు
- తాజాగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డిండి ఆర్ఐ
- 'కల్యాణలక్ష్మి' చెక్కు ఇచ్చేందుకు రూ.5వేలు డిమాండ్

అయినా.. తీరు మారలే

ఉన్నతాధికారుల విస్తృత తనిఖీలు.. పర్యటనలు ఓ వైపు.. సస్పెన్షన్లు.. కఠిన చర్యలు.. ఏసీబీ పట్టివేతలు మరోవైపు కొనసాగుతున్నా కొందరు రెవెన్యూ అధికారుల తీరు మాత్రం మారడం లేదు. పోస్టింగ్ వచ్చిందే తడువు కొందరు పైసా కమాయించడంపైనే దృష్టిసారిస్తున్నారన్న ఆరోపణలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారిని నెలల తరబడి తిప్పించుకుంటున్నారని, పైసలిస్తే మాత్రం వెంటనే చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాజాగా ఓ లబ్ధిదారుడికి కల్యాణలక్ష్మి చెక్కు ఇచ్చేందుకు రూ.5 వేలు లంచం తీసుకుంటూ నల్లగొండ జిల్లా డిండి తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు.

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలకు ఇన్‌చార్జి తహసీల్దార్లు ఉన్నారు. ప్రస్తుతం సొంత మండలంలోనే పలు సర్వేలు, ప్రభుత్వ పథకాల బాధ్యతలు ఉండటంతో వారు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మండలాలపై అంతగా దృష్టిసారించలేకపోతున్నారు. దీంతో సదరు మండలాల్లో కింది స్థాయి ఉద్యోగుల ఇష్టారాజ్యమైందనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో సర్వేయర్ల కొరత కూడా ఉంది. ఏదైనా భూ సర్వే కోసం అర్జీ పెడితే నెలలకొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని, పైసలిస్తేనే సర్వేయర్లు భూ కొలతలకు వస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఓ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో పైరవీకారులదే పెత్తనం నడుస్తోంది. సస్పెండ్ అయిన రెవెన్యూ ఉద్యోగులకు మూడు నెలలు తిరగకముందే పోస్టింగులు ఇస్తుండటంతో వారి ఇష్టారాజ్యమైంది. డిండి మండలంలో ధరణి పోర్టల్‌లో మిస్సింగ్ సర్వే నంబర్లు రెవెన్యూ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కొన్ని కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించకపోవడంతో గంటలకొద్దీ వేచి ఉండటంతో పాటు పనుల కోసం కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సివస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రూ.5వేలు ఇస్తేనే..

నల్లగొండ జిల్లా డిండి మండలం పడమటితండాకు చెందిన రాత్లావత్ పాండు హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన తన కుమార్తె అఖిలను 10 డిసెంబరు 2021న మహబూబ్‌నగర్ జిల్లా జైనుల్లాపూర్ కొర్రతండాకు చెందిన తిరుపతికి ఇచ్చి వివాహం చేశాడు. కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేయగా, మూడేళ్లుగా చెక్కు జారీ కాలేదు. చెక్కు జారీ చేసేందుకు ఆర్ఐ శ్యాంనాయక్ రూ.10వేలు లంచం డిమాండ్ చేయటంతో పాండు రూ.5వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఈ క్రమంలో పాండునాయక్ తన బావమరిది శంకర్‌తో కలిసి ఈ నెల 9వ తేదీన నల్లగొండ ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించాడు. ఆర్ఐ శ్యాంనాయక్ కూడా హైదరాబాద్‌లోని హస్తినాపురంలోని ఉర్మిలనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శుక్రవారం పాండునాయక్ హస్తినాపురంలోని ఆర్ఐ శ్యాంనాయక్ ఇంటికి వెళ్లి రూ.5వేలు లంచం ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు శ్యాంనాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్యాంనాయక్ గతంలో పీఏపల్లి మండలంలో పనిచేస్తున్న సమయంలోనూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ●6లో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 199మంది పంచాయతీ కార్యదర్శులు ప్రొబేషనరీ (శిక్షణ) సమయంలోనే విధులకు డుమ్మా కొడుతున్నారు. సర్వీస్ క్రమబద్ధీకరణ జరగకముందే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండా నెలలు గా గైర్హాజరవుతున్నారు. ఇటీవల కొందరు విధుల్లో చేరేందుకు రాగా, వారికి ఆయా జిల్లాల కలెక్టర్లు షోకాజ్ నోటీసులు జారీ చేసి విధుల్లోకి తీసుకున్నారు. షోకాజ్‌లకు వారిచ్చే వివరణకు సంతృప్తి చెందితే ఎలాంటి చర్యలు ఉండవు. లేకుంటే చర్యలకు లోబడాల్సి ఉంటుంది. కాగా, నల్లగొండ జిల్లాలో 99మంది పంచాయతీ కార్యదర్శులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి కఠిన చర్యలు తీసుకున్నారు. వారి సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

-ఆంధ్రజ్యోతి, సూర్యాపేట కలెక్టరేట్, నల్లగొండ





పంచాయతీ కార్యదర్శులపై కొరడా

- అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు
- ఉమ్మడి జిల్లాలో 199 మంది కార్యదర్శులకు షోకాజ్
- నల్లగొండ జిల్లాలో 99మంది సర్వీస్ బ్రేక్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం

ప్రొబేషనరీ సమయంలో ఏ శాఖకు సంబంధించిన ఉద్యోగి అయినా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కాకూడదు. ఒకవేళ అయితే అధికారుల చర్యలకు గురికావాల్సి ఉంటుంది. ప్రతీ ఉద్యోగికి రెండేళ్ల ప్రొబేషనరీ సమయం ఉంటుంది. ఆ సమయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అంకితభావంతో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ విధుల్లో పొరపాట్లు చేస్తే వారి సర్వీస్ క్రమబద్ధీకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయి. అందుకోసం ప్రతీ ఉద్యోగి ప్రొబేషనరీ సమయంలో ఎంతో జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 199 మంది కార్య దర్శులకు షోకాజ్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 199 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు షోకాజ్ జారీ చేశారు. నల్లగొండ జిల్లాలో 99 మంది, సూర్యాపేట జిల్లాలో 70మంది, యాదాద్రి జిల్లాలో 30మంది గ్రామకార్యదర్శులు ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా నెలల తరబడి విధులకు గైర్హాజరయ్యారు. ఇటీవల వారు విధుల్లో చేరేందుకు రాగా, వారికి ఆయా జిల్లాల కలెక్టర్లు షోకాజ్ జారీ చేసి విధుల్లోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారందరూ వారికి కేటాయించిన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే షోకాజ్‌లపై విచారణకు ప్రత్యేకాధికారిని నియమించనున్నారు. ఏదైనా అత్యవసర పనుల నిమిత్తం, ఆరోగ్య కారణాల కారణంగా గైర్హాజరైతే మాత్రం వారికి చర్యల నుంచి మినహాయింపు దక్కనుంది.

గైర్హాజరుతో ఇతరులపై పనిభారం

ఉమ్మడి జిల్లాలో సుమారు 199 మంది గ్రామకార్యదర్శులు విధులకు గైర్హాజరు కావడంతో వారి విధులు మిగిలిన వారు చేయాల్సి వస్తోంది. దీంతో ఇతర...

- మిగతా 6వ పేజీలో...

కార్యదర్శులకు నష్టం ఉండదు

ముందస్తు అనుమతి లేకుండా దీర్ఘకాలం విధులకు గైర్హాజరైన వారిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తాం. అయితే పంచాయతీ కార్యదర్శుల విషయంలో మానవతా దృక్పథంతో వారిని సస్పెండ్ చేయకుండా సర్వీస్ బ్రేక్ చేసి విధుల్లోకి తీసుకున్నాం. జిల్లాలో సుమారు 99మంది పంచాయతీ కార్యదర్శులు ముందస్తు అనుమతి లేకుండా నెలలతరబడి విధులకు గైర్హాజరయ్యారు. వీరిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, రెగ్యులర్ కార్యదర్శులు ఉన్నారు. సర్వీస్ బ్రేక్ చేసి విధుల్లోకి తీసుకోవడం వల్ల వారికి నష్టమేమీ ఉండదు.

- ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్



గైర్హాజరైన కార్యదర్శులకు షోకాజ్‌లు జారీ చేశాం.

ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండా విధులకు గైర్హాజరైన పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం వారందరికీ కేటాయించిన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. నెలల తరబడి విధులకు గైర్హాజరు కావడంతో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలులో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో సమీప గ్రామాల కార్యదర్శులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాం. షోకాజ్‌లకు వివరణ ఇచ్చిన అనంతరం కలెక్టర్ చర్యలు తీసుకోనున్నారు.

- నారాయణరెడ్డి, డీపీవో, సూర్యాపేట జిల్లా

గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్, పాల్గొన్న కలెక్టర్ త్రిపాఠి

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాలుగు పథకాలకు సంబంధించిన విధివిధానాలను గ్రామసభల్లో ప్రజలకు వివరించి జాబితాను చదివి అర్హులను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, రైతు భరోసా సర్వేకు జిల్లాలో 140 బృందాలు ఏర్పాటు చేసి ఈనెల 16 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 138 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందని తెలిపారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి అనితా రాంచంద్రన్ అన్నారు. శుక్రవారం కనగల్‌లో రేషన్‌కార్డుల సర్వేను ఆమె తనిఖీచేసి అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆమె వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, ఎంపీవో సుమలత, డీటీ పార్వతమ్మ, తదితరులు ఉన్నారు.



మదర్ డెయిరీపై రాజకీయ రగడ

మదర్ డెయిరీపై రాజకీయ రగడ జోరందుకుంది. స్వచ్ఛందంగా పాల ఉత్పత్తిదారులతో కొనసాగాల్సిన సంఘాలకు రాజకీయ రంగు పులుముకుంది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలు నగరానికి చేరువలో ఉండటంతో పాడి రైతులు నిత్యం హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాలకు ఇక్కడి నుంచి పాలను సరఫరా చేస్తున్నారు. ఒకప్పుడు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరపతి సహకార సంఘానికి(నార్ముల్) పాడి రైతులతో కూడిన పాలకవర్గం ఉండేది. నేడు అది రాజకీయాలకు వేదికగా మారింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

మదర్ డెయిరీ పాలకమండలి రూపొందించిన నష్టాల నివేదిక ఇలా..	
సంవత్సరం	నష్టం
2015-16	రూ.8,12,58,578
2016-17	రూ.2,11,47,520
2017-18	రూ.2,24,83,176
2018-19	రూ.1,98,33,139
2019-20	రూ.3,08,79,584
2020-21	రూ.1,92,33,229
2021-22	రూ.3,67,02,301
2022-23	రూ.4,52,17,923
2023-24	రూ.7,48,33,021
మొత్తం	రూ.35,15,88,471

- ఆర్థికాభివృద్ధిపై కాంగ్రెస్,బీఆర్ఎస్ నేతల సవాళ్లు
- సంస్థ లాభ,నష్టాలపై ప్రచ్ఛన్న యుద్ధం
- ఫిబ్రవరి 7న సర్వ సభ్య సమావేశం
- సంస్థ భూముల విక్రయమే ప్రధాన అజెండా

మదర్ డెయిరీలోని ఆస్తులు, లాభాలు, నష్టాలపై అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రస్తుత ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది. రైతుల డబ్బులతో కొనుగోలు చేసిన మదర్ డెయిరీ భూములను విక్రయించాలని ప్రస్తుత పాలకవర్గం చూస్తోందని గత పాలకవర్గ సభ్యులు ఆరోపిస్తున్నారు. రైతులకు బోనస్ చెల్లించడంతోపాటు సంస్థ ఆస్తులను కాపాడామని డిమాండ్ చేస్తున్నారు. అయితే పదేళ్లుగా మదర్ డెయిరీలో జరిగిన అవకతవకల కారణంగా నష్టాలు వచ్చాయని, దీంతో సంస్థ భూములు విక్రయించి రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ప్రస్తుతం పాలకవర్గం ఎదురుదాడి చేస్తోంది. కొత్త పాలకవర్గం మూడునెలల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్‌కు చెందిన సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, నష్టాలు సహా పాల సంఘాలకు వివరించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఫిబ్రవరి 7వ తేదీన పాల సంఘాలతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, భూముల విక్రయంపై తీర్మానం చేసేందుకు ప్రస్తుత పాలకవర్గం సన్నాహాలు చేస్తోంది. మదర్ డెయిరీకి చిట్యాలలో 32ఎకరాలు, మిర్యాలగూడలో 1.20ఎకరాలు, హాలియా, మాల్, తదితర ప్రాంతాల్లో సొంతంగా భూములు ఉన్నాయి. ఈ భూములపైనే ప్రస్తుత, గత పాలకవర్గ సభ్యుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 350 పాలకసంఘాలు ఉన్నాయి. అన్ని సంఘాల చైర్మన్లను సర్వసభ్య సమావేశానికి ఆహ్వానించి, మదర్ డెయిరీ ఆర్థిక పరిస్థితి, లాభాలు, నష్టాలపై పూర్తిస్థాయి నివేదికను అందించేందుకు ప్రస్తుత పాలకవర్గం ప్రయత్నాలు - మిగతా 7వ పేజీలో...

మాతాశిశు మరణాల సంఖ్య తగ్గాలి

- రోగులకు అందుబాటులో ఉండి సేవలందించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, కొండమల్లేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మాతాశిశు మరణాల సంఖ్య తగ్గాలని, రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని, మళ్లీ వారంలో వస్తానని, అప్పటి వరకు మార్పు రావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, డయాలసిస్, ఎన్‌సీహెచ్ విభాగం, మందుల స్టాక్ వివరాలను తనిఖీచేశారు. మాతాశిశు సంరక్షణ విభాగాన్ని సందర్శించి బాలింతలతో మాట్లాడారు. ఔట్, ఇన్ పేషంట్ల వివరాలను పరిశీలించి వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ మంగ్యానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో కొంతమంది మద్యం తాగి ఆస్పత్రికి వస్తున్నారని, ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఎస్పీతో మాట్లాడి ఔట్‌పోస్టు ఏర్పాటు కృషి చేస్తానన్నారు. కలెక్టర్‌వెంట ఆర్డీవో రమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్,తహసీల్దార్ సంతోష్‌కిరణ్, సీఐ నర్సింహులు, ఎస్ఐ రమేష్, తదితరులు ఉన్నారు. అనంతరం పట్టణంలోని తాటికోలు రోడ్డులో రేషన్‌కార్డుల సర్వేను కలెక్టర్ తనిఖీచేశారు. అదేవిధంగా కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి పంచాయతీలో సర్వేను కలెక్టర్ తనిఖీచేశారు.

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ క్రైం): నల్లగొండను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయిని నిర్మూలించేందుకు మిషన్ పరివర్తన్ కింద అవగాహన కార్యక్రమాలు మళ్లీ నిర్వహించాలని సూచించారు. గంజాయి సాగుచేస్తే రైతులకు రైతుభరోసా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ నెల 21న మరోమారు అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. నల్లగొండ ఆస్పత్రిలో డ్రగ్ డీఅడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్‌శాఖ అధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు పలు ప్రభుత్వ విద్యా సంస్థలకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో గెలిచిన అభ్యర్థులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదన్నారు. అంతేగాక ఉపాధ్యాయులు, అధ్యాపకులకు వ్యతిరేక నిర్ణయాలు వచ్చినప్పుడు ఖండించాల్సింది పోయి పాలకుల పంచన చేరారని విమర్శించారు. 317 జీవో తెచ్చినది తానేనని చెప్పిన వ్యక్తి ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్నాడని, సీపీఎస్ రద్దు, పదోన్నతులు, సర్వీస్ రూల్స్ తెస్తానని మోసం చేసి మళ్లీ మభ్యపెట్టి ఓట్లు వేయించుకునేందుకు వస్తున్న వారి మోసాలను పసిగట్టాలన్నారు. 42 ఉపాధ్యాయ సంఘాల జేఏసీ మద్దతుతో తాను ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నాని, మ్యానిఫెస్టోను ముందుంచుతూ ఓట్లను అభ్యర్థిసున్నానన్నారు. ఉమ్మడి సర్వీస్ సాధించి పదోన్నతులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయించడంతో పాటు 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి 010 పద్దు ద్వారా వేతనాలు, ఆరోగ్య కార్డుల సౌకర్యం కల్పించేందుకు పోరాడతానన్నారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్, కేజీబీవీలో హాస్టల్ వార్డెన్లను నియమిస్తూ రెండో శనివారం సెలవు కోసం ప్రయత్నిస్తానన్నారు. ఉపాధ్యాయులకు నెలనెలా పదోన్నతులు, ఏటా వేసవిలో బదిలీలకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

జాతీయ రహదారిపై కొనసాగుతున్న వాహనాల రద్దీ ●7లో..

అంబుజా సిమెంట్‌పై

నేడు ప్రజాభిప్రాయ సేకరణ



దామరచర్ల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేష్‌పహాడ్ గ్రామ సమీపంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ (పెన్నా సిమెంట్) మైనింగ్ విస్తరణపై అధికారులు శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. 2002లో పెన్నా సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం నిర్మించగా, ఇటీవల ఈ పరిశ్రమను అదానీ గ్రూప్ కొనుగోలు చేసి అంబుజా సిమెంట్‌గా పేరు మార్చింది. మండలంతో పాటు సూర్యాపేట జిల్లా శూన్యపహాడ్ గ్రామ పరిధిలో మొత్తం 354 హెక్టార్లలో మైనింగ్ గనులు విస్తరించి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.8మిలియన్ టన్నులకు పెంచేందుకు పరిశ్రమ యాజమాన్యం గనులశాఖ, కాలుష్య నియంత్రణ మండలికి దరఖాస్తు చేసుకుంది. అదేవిధంగా పరిశ్రమ అనుమతులు రెండేళ్ల క్రితమే ముగిసినా యాజమాన్యం అక్రమంగా తవ్వకాలు చేస్తోందని పలువురు పర్యావరణ వేత్తలు, స్థానికులు ఇటీవల పీసీబీ, జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అటవీ భూములను సైతం ఆక్రమించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గనుల విస్తరణపై చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలు తెలిపేందుకు స్థానికులు సన్నద్ధమయ్యారు. ఇటీవల కాలంలో రెండు పర్యాయాలు ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు నిర్ణయించినా, పలు కారణాలతో అవి వాయిదా పడ్డాయి. తాజాగా, మూడోసారి ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్రంలో 927 శాఖలతో రూ.70కోట్ల వ్యాపారంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తోందని బ్యాంక్ చైర్మన్ వై.శోభ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని ప్రాంతీయ కార్యాలయం, స్థానిక బ్రాంచ్‌లను ఆమె పరిశీలించి మాట్లాడారు. బ్యాంక్ ద్వారా రైతులు, స్వయం సహాయక బృందాలు, వ్యాపారులకు సేవలందిస్తున్నామన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతంలో బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో సైతం తాము సేవలందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎంటీ దేవేందర్, ఎస్ఎంవో సీహెచ్.వెంకటేశ్, డీపీఎం రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ టూ నాగర్‌కర్నూల్

» జోరుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా » అధికారులు తనిఖీలు చేసినా ఆగని వైనం » నామమాత్రంగా కేసులు » పట్టించుకోని అధికారులు



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పౌరసరఫరాల, పోలీస్‌శాఖ అధికారులు

దేవరకొండ డివిజన్‌లో రేషన్‌బియ్యం అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుంది. రేషన్‌బియ్యం పక్కదారి పట్టిస్తే సంబంధిత డీలర్లు, రేషన్‌కార్డు వినియోగదారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయినా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. పౌరసరఫరాలశాఖ, పోలీ స్ అధికారులు తనిఖీలు చేసి రేషన్ బియ్యాన్ని కేసులు నమోదు చేస్తున్నా బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. అక్రమంగా రేషన్‌బియాన్ని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే అందుకు ప్రధాన కారణం.

- (ఆంధ్రజ్యోతి,దేవరకొండ)

దేవరకొండ డివిజన్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాకు జోరుగా రేషన్‌బియ్యం అక్రమంగా రవాణా అవుతుంది. దేవరకొండ డివిజన్‌లోని ప్రధాన గోదాం నుంచి ప్రతి నెలా 10 వేల క్వింటాళ్ల రేషన్‌బియ్యం 230 రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. కొంత మంది రేషన్ డీలర్లు వ్యాపారులతో కుమ్మక్కై రేషన్ బియ్యాన్ని విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా ఈ నెల 12వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా బొల్లారు గ్రామానికి చెందిన నేనావత్ హరి దేవరకొండలో 30 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి బొలొరో వాహనంలో నాగర్‌కర్నూల్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ డీటీసీఎస్ స్వాధీనం చేసుకొని 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఆ రేషన్‌బియ్యాన్ని దేవరకొండలో వినియోగదారుల వద్ద కొనుగోలు చేసి నాగర్‌కర్నూల్ జిల్లాకు తరలిస్తున్నట్లు పట్టుబడిన వ్యక్తి నేనావత్ హరి విచారణలో పేర్కొన్నాడు. రేషన్ బియ్యాన్ని అతనికి ఎవరు విక్రయించారనేది ఇప్పటివరకు అధికారులు తేల్చలేకపోయారు. దేవరకొండ పట్టణంలో గత సంవత్సరం నవంబరులో చంద్రన్న కాలనీలో 40 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. పౌరసరఫరాలశాఖ పోలీసులకు సమాచారం అందడంతో రేషన్ బియ్యాన్ని అక్కడే వదిలి పారిపోయారు. 40 క్వింటాళ్ల బియ్యాన్ని ఎవరు అక్రమంగా తరలిస్తున్నారనే విషయం ఇప్పటికీ తెలియరాలేదు. పోలీసు, పౌరసరఫరాలశాఖ అధికారులు బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న రేషన్‌డీలర్లపై నిఘా ఏర్పాటు చేయకపోవడమే అక్రమ రవాణాకు కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్నా దేవరకొండ డివిజన్‌లోని చందంపేట, పీఏపల్లి, పోలేపల్లి, కొండమల్లేపల్లి, డిండి, దేవరకొండ, నేరేడుగొమ్ము మండలాల్లో రేషన్‌బియ్యం పక్కదారి పడుతున్న సంఘటనలు తరుచూ జరుగుతూనే ఉన్నాయి. గతేడాది ఆగస్టు నెలలో నాగర్‌కర్నూల్‌కు తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని డీటీసీఎస్ శ్రీనివాస్ పట్టుకొని విచారణ చేపట్టారు. ఆ బియ్యం దేవరకొండ పట్టణంలోని 12వ రేషన్ దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లుగా విచారణలో నిర్ధారణ అయింది. దీంతో పౌరసరఫరాలశాఖ అధికారులు పట్టణంలోని 12వ రేషన్‌షాపు డీలర్ సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. అతడిని విధుల నుంచి మరో డీలర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 3వ తేదీన పీఏపల్లి మండలం నుంచి కొండమల్లేపల్లికి ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొండమల్లేపల్లి ఎస్ఐ రాంమూర్తి పట్టుకొని కేసు నమోదు చేశారు. ఇలాంటి సంఘటనలు డివిజన్‌లో తరుచూ జరుగుతున్నా ఉన్నతాధికారులు, పౌరసరఫరాలశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇకనైనా రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

రేషన్‌బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే సంబంధిత రేషన్ డీలర్లపై చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసిన బియ్యాన్ని ఇతరులకు అమ్మితే రేషన్‌కార్డులు రద్దు చేస్తాం. ఇప్పటికే తనిఖీలు నిర్వహించి రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఒకే వ్యక్తి రెండు సార్లు పట్టుబడితే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తాం.

- హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, డీటీసీఎస్, దేవరకొండ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అశోక్, పశువైద్యాధికారి



ప్రస్తుత శీతాకాలంలో చలి తీవ్రత పెరుగుతున్నందున పశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దీంతో పశువులు వ్యాధుల బారిన పడకుండా సంరక్షించుకోవచ్చని మండల పశువైద్యాధికారి అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(వేములపల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: శీతాకాలంలో చలితీవ్రత దృష్ట్యా పశువులకు ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలి?

ఏవో: శీతాకాలంలో పశువులను ముఖ్యంగా చిన్న దూడలను రాత్రి సమయంలో ఆరు బయట కట్టేయకుండా షెడ్డులో కట్టివేయాలి. అవసరమైతే గన్నీ సంచులతో కప్పడం మంచిది. నేల మీద తడి లేకుండా ఎండుగడ్డితో కప్పి ఉంచాలి. దీనివల్ల హైపోథెర్మియా లాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పడవచ్చు.

ఆంధ్రజ్యోతి: తెల్లజాతి పశువులు శీతాకాలంలో ఏ విధమైన వ్యాధులకు గురవుతాయి?

ఏవో: తెల్లజాతి పశువుల్లో ముఖ్యంగా ముద్ద చర్మ వ్యాధి రావడానికి అవకాశం ఉంది. సంవత్సరంలోపు దూడల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కావున సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోవాలి. అవసరమైతే ముందుగానే వేయించుకోవడం వల్ల మరింత ఉపశమనం పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి: పాల దిగుబడికి పెరగడానికి ఏ విధమైన చర్యలు చేపట్టాలి?

ఏవో: చలి తీవ్రత దృష్ట్యా పశువుల్లో పాల దిగుబడి తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పశువులకు ముఖ్యంగా పౌష్టికరమైన మేత ను అందించడం ద్వారా పాల దిగుబడిని పెంచుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: పశు సంవర్ధకశాఖ ద్వారా ఏమైనా సబ్సిడీ పథకాలు అందుబాటులో ఉన్నాయా?

ఏవో: కేంద్రప్రభుత్వం ద్వారా నేషనల్ లైవ్ స్టాక్స్ మిషన్ పథకం కింద 50శాతం సబ్సిడీ ద్వారా గొర్రెలు, మేకలు, పెరటి కోళ్ల పెంపకం అందిస్తున్నారు. అవసరమైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో యువత రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆరు రోజుల పాటు ఘనపురం ఎక్స్ రోడ్డు వద్ద కేఎల్‌ఆర్ యూత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో విన్నర్‌గా దోనియా జట్టు - రన్నరప్‌గా ఘనపురం జట్టు నిలిచింది. ఈ కార్యక్రమానికి కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి హాజరై విజేతలకు నగదుతో పాటు షీల్డ్‌ను బహూకరించారు. విన్నర్ జట్టుకు రూ. 30 వేలు మరియు షీల్డ్ బహూకరించగా, రన్నర్ జట్టుకు నిమ్మల సంతోష్‌రెడ్డి రూ.25 వేలు, షీల్డ్‌ను అందించారు. మూడవ బహుమతి మాజీ సర్పంచ్ పావనిపరమేష్ రూ.20 వేలుతో పాటు షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రేషన్‌కార్డులు ఇప్పించండి



సమస్యను కలెక్టర్‌కు విన్నవిస్తున్న పాపనాయక్

దేవరకొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ గారు నిరుపేద గిరిజనులకు రేషన్‌కార్డులు మంజూరు చేయించాలని నేరేడుగొమ్ము మండలం బుగ్గతండా వాసి పాపనాయక్ కలెక్టర్ ఇలా త్రిపాఠికి విన్నవించారు. శుక్రవారం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తనిఖీకి వచ్చిన కలెక్టర్‌ను ఆయన కలిశారు. బుగ్గతండాలో 15 మందికి అర్హత ఉన్నా రేషన్‌కార్డులు అందలేదన్నారు. విచారణ జరిపి అర్హులైన గిరిజనులకు నూతన రేషన్‌కార్డులు అందేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

కొర్ర చిన్ననాయక్ మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండలంలోని కొ త్రోనితండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొర్ర చిన్ననాయక్ మృతి బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం కొర్రోనితండాలో కొర్ర చిన్ననాయక్ మృతదేహానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రమావత్ దస్రూనాయక్, రమావత్ తులసీరాం, కొర్ర బీమా, హరికృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలను పేదలకు అందేలా కృషి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



పొరెడ్డిగూడెంలో 'మన ఊరు-మన ఎమ్మెల్యే' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మాడ్గులపల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను పేద ప్రజలందరికీ అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని పాములపాడు, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, ఆగామోత్కూర్, గుర్రప్పగూడెం, భీమనపల్లి, కల్వలపాలెం, బొమ్మకల్, సీత్యాతండా, తోపుచర్ల, ఇసుకబావిగూడెం, గండ్రవానిగూడెం, కుక్కడం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామాల్లోని ప్రజలను, నాయకులను కలిసి గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. ఆరు గ్యారెంటీ పథకాలు, మన ఊరు-మన ఎమ్మెల్యే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుచేస్తున్న రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రతి ఒక్కరికీ అందించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను తిరిగి జరగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో మన ఊరు -మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి గ్రామానికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా పేదలకు అందిస్తామన్నారు. గ్రామాల్లో కులమతాలకు అతీతంగా ప్రతీ గ్రామంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ నాయకులు, చదువుకున్న యువత కలిసి గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, గ్రామాభివృద్ధికి కావాల్సిన అవసరాలను తెలుసుకొని ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. గ్రామాభివృద్ధి కోసం కృషి చేయని గ్రామ కమిటీ సభ్యులను తొలగించనున్నట్లు ఆయన హెచ్చరించారు. తాను నిర్వహించే ఈశ్వరబంధం కార్యక్రమాన్ని మహా శివరాత్రి నుంచి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, మునగాల చంద్రారెడ్డి, తోట సత్తిరెడ్డి, యాదగిరి, జూలకంటి సైదిరెడ్డి, చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, బట్టు మాధవరెడ్డి, చింతకాయల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


మిర్యాలగూడ: యువత క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు ఆయన బహుమతులు అందచేసి మాట్లాడారు. క్రీడల వల్ల యువకుల్లో స్నేహ సంబంధాలు మెరుగు పడుతాయని, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు చిలుకూరు బాలు, రవినాయక్, జానిపాషా, ముదిరెడ్డి నర్సిరెడ్డి, ధర్మానాయక్, రమేష్‌నాయక్, చక్రినాయక్, శరత్, అశోక్‌నాయక్, కృష్ణ, అనిల్‌కుమార్, నాగునాయక్, కోటి, శ్రీధర్, లక్ష్మణ్, ప్రశాంత్, మహేష్, గని తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమైన దేవరకొండ ఖిల్లా పార్కు

● రూ.5 కోట్లతో నిర్మించిన పార్కు నిర్మాణ పనులు

● నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే బాలునాయక్





ప్రారంభానికి సిద్ధమైన దేవరకొండ ఖిల్లాలోని పార్కు

దేవరకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ చరిత్ర కలిగిన దేవరకొండ ఖిల్లాలో ఐదు ఎకరాలలో రూ.5 కోట్లతో నిర్మించిన పార్కును సిద్ధమైంది. పార్కును ఈ నెల 18న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించనున్నారు. పార్కు ప్రారంభంతో దేవరకొండ ఖిల్లాకు పర్యాటకుల తాకిడి పెరగనుంది. 2018లో పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఐదు ఎకరాల్లో వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట సామగ్రి, అందమైన పూల మొక్కలు, చెట్లకు నీరందించేందుకు డ్రిప్పు ఇరిగేషన్ విధానం ఏర్పాటు చేశారు. పార్కులో రోడ్డు, లైట్లు ఏర్పాటు చేశారు. పర్యాటకుల కోసం క్యాంటిన్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పార్కు నిర్మాణం పూర్తి కావడంతో దేవరకొండ ఖిల్లాకు పర్యాటక శోభ సంతరించుకుంది.

అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

చింతపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని మండలంలోని కుర్మేడ్‌కు చెందిన న్యాయవాది గుర్రం వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో అక్రమ డిప్యూటేషన్‌పై చర్యలు తీసుకోవాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది మహిళా అధ్యాపకులు అక్రమ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అయినా జిల్లా శాఖ స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్యాశాఖలో క్షేత్రస్థాయిలో పరిశీలించి డిప్యూటేషన్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

● శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరం లాంటిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి పథకం ద్వారా సహాయం పొందిన 41మంది నిరుపేదలకు రూ.13.36లక్షల విలువైన చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వేలాది మంది పేదలకు సహాయం అందుతుందని ఆయన తెలిపారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

చండూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దశరథ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 119 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీటీ నిర్మలాదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సహజ యోగా ట్రస్టు రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ అన్నారు. సహజయోగ ప్రచార రథం శుక్రవారం నల్లగొండ పట్టణంలో ప్రవేశించి పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యాన విధానాన్ని మాతాజీ నిర్మలాదేవీ ప్రపంచానికి పరిచయం చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చైతన్య రథాలతో సహజ యోగా ధ్యాన విధానాన్ని ప్రజలకు పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో 15 రోజుల పాటు పర్యటించనున్నట్లు తెలిపారు.

సాగు చేయని భూముల సర్వే పక్కాగా ఉండాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్



భూముల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి

కేతేపల్లి, మర్రిగూడ, రామగిరి, శాలిగౌరారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగుకు యోగ్యం కాని భూముల సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. రైతుభరోసా పథకం అమలుకు చేపట్టిన వ్యవసాయ యోగ్యంకాని భూముల సర్వేను ఆయన ఆర్డీవో అశోక్‌రెడ్డితో కలిసి శుక్రవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్‌లో గల ఫామ్‌ల్యాండ్స్‌లో నిర్వహిస్తున్న సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎన్ని సర్వే నెంబర్లలో ఎన్ని ఎకరాలు సాగుకు యోగ్యంకాని భూముల జాబితాలో ఉన్నాయి? ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో ఎన్ని ఎకరాల భూములు సర్వే పూర్తి చేశారని వివరాలు అధికారులు, సర్వే బృందం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భూభారతి ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న వివరాల మేరకు సర్వే చేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే వివరాలు తప్పులకు ఆస్కారం లేకుండా పక్కాగా ఉండాలన్నారు. భూభారతి నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న సర్వే నెంబర్లలోని భూములన్నీ సర్వే చేయాలన్నారు. సర్వేలో అనర్హులను గుర్తించి రైతుభరోసాలో ప్రభుత్వ డబ్బు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత సర్వే బృందాలదేనన్నారు. సర్వే వల్ల అర్హులైన రైతులకు అన్యాయం జరగకుండా ఉండాలన్నారు. అదన పు కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఏవో బి.పురుషో త్తం, సర్వే సిబ్బంది ఉన్నారు.

పొరపాట్లకు అవకాశం ఇవ్వవద్దు

ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాల పరిశీలన అధికారులు పొరపాట్లకు అవకాశం ఇవ్వవద్దని మర్రిగూడ మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు అన్నారు. మండలంలోని లెంకలపల్లి, ఎరుగండ్లపల్లి, వట్టిపల్లి, శివన్నగూడ, మర్రిగూడ గ్రామాల్లో రైతుభరోసా సర్వే కార్యక్రమాన్ని ని ర్వహించారు. రైతులు రైతుభరోసా పథకం కింద భూభారతి కింద డౌన్‌లోడ్ చేసుకున్న భూముల వివరాలు వ్యవసాయ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో హేమలత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పలువురు రైతులు ఉన్నారు.

● నల్లగొండ పట్టణంలో జరుగుతున్న రేషన్ కార్డుల సర్వే పా రదర్శకంగా జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. పట్టణంలో జరుగుతున్న సర్వే కా ర్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే పారదర్శకంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో 48 వార్డులకు గాను 1545 దరఖాస్తులు రాగా 50శాతం పైగా క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. మిగిలిన సర్వే ఈ నెల 20వ తేదీలోగా చేస్తామన్నారు. దరఖాస్తుదారులు అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

● శాలిగౌరారం మండలం అడ్లూరు, వల్లాల గ్రామాల్లో అధికారులు చేపడుతున్న రేషన్‌కార్డు లబ్ధిదారుల సర్వేను జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. రేషన్‌కార్డులు ప్రక్రియ నిరంతరం ఉంటుందన్నారు. నిబంధనలకు లోబడి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. తరి మూడున్నర, మెట్ట ఐదు ఎకరాలలోపు, సంవత్సర ఆదాయం లక్షన్నర లోపు ఉంటే రేషన్‌కార్డులకు అర్హులని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మాన్యానాయక్, తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో సుధాకర్, ఎంపీవో అల్లూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని దుకాణాల తొలగింపు

నార్కట్‌పల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేవస్థాన స్థలంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న దుకాణాలను చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దే వస్థానం అధికారులు, సిబ్బంది శుక్రవారం తొలగించారు. గుట్ట కింద పార్వతీ అమ్మవారి గుడికి వెళ్లే దారిలో కుడివైపు దేవస్థానానికి చెందిన కొంత ఖాళీ స్థలం ఉంది. అయితే గ్రామానికి చెందిన కొందరు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి దేవస్థానం అనుమతి లేకుండా చిరు వ్యాపారులు అనధికారికంగా తోపుడు బండ్లను, టేబుళ్లను ఏర్పాటు చేసుకుని కొంత కాలంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి దేవస్థానానికి చెందిన స్థలాలు, షాపుల్లో వ్యాపారాలు చేసుకోవడానికి ప్రతీ యేటా టెండర్ పద్ధతి ద్వారా షాపులన కేటాయిస్తారు. అయితే పక్కా భవనాలలోని షాపులకు టెండర్ నిర్వహించి కేటాయించగా ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.

రాజకీయ ఒత్తిళ్లకు తోడు చిరు వ్యాపారులు కావడంతో దేవస్థానం అధికారులు కూడా ఇంతకాలం కొంత చూసీ చూడనట్లు వ్యవహరించారు. వారి నుంచి ముడుపులు స్వీకరించి అనధికారికంగా షాపుల నిర్వహణకు సహకరిస్తూ టెండర్ ద్వారా దేవస్థానానికి వచ్చే ఆదాయానికి చెర్వుగట్టు దేవస్థానం అధికారులు గండి కొడుతున్నారని కొందరు కలెక్టర్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆమె సూచనల మేరకు అనధికారికంగా నిర్వహిస్తున్న చిరువ్యాపారుల దుకాణాలను ఈవో సిరికొండ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో తొలగించారు. ఖాళీ చేసిన స్థలాన్ని ఇతరులు ఆక్రమించుకోకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.